


GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక
CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 80 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 30 మే 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



1959 - 2024
దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్

## గుండెధైర్యం ఉన్నవారే యుద్ధాన్ని గెలిపిస్తారు

పాక్‌తో యుద్ధం అర్థంతరంగా ఎందుకు ఆపారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికిఎందుకు తలొగ్గారు

యుద్ధం ఆపితు అఖిలపక్షానికి ఎందుకు చెప్పలేదు

ఇందిరాగాంధీ పాక్‌పై అలాగే గెలిచారు

జైహింద్ ర్యాలీలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



**మేడ్చల్,మే29(సమయజ్యోతి):**

పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్రానికి సహకరించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్థాంతరంగా ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. యుద్ధం చేయాలను కున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారని తెలిపారు. ఉగ్రవాదులను తుదముట్టించేవరకు సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు. ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జై హింద్ యాత్ర నిర్వహించారు. బాచుపల్లి వీఎన్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి జైహింద్ యాత్ర కొనసాగింది. జై హింద్ యాత్ర అనంతరం నిజాంపేట కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్థంతరంగా ఆపేశారా అని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తుచేశారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించినందుకా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు.

2లో.

## ప్రధాని వ్యాఖ్యలపై మమతా బెనర్జీ ఫైర్

● టీవీ చర్చకు సిద్దమేనా అంటూ సవాల్ ● బెంగాల్‌పై కోసాధింపు చర్యలు తగవని హితవు



**కోల్‌కతా,మే29(సమయజ్యోతి):**

ప్రధాని మోడీ-పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. గురువారం ప్రధాని మోడీ పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వమే లక్ష్యంగా మోడీ విమర్శలు గుప్పించారు. మమతను ఉద్దేశించి 'నిర్మత' అనే మాటను ఉపయోగించారు. హిందీలో క్రూరత్వం అని అర్థం వచ్చే విధంగా 'నిర్మత' అనే మాటను ప్రధాని మోడీ ఉపయోగించారు. మమత శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమైందని.. పౌరుల భద్రతను విస్మరించిందని ఆరోపించారు. గత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ముర్షిదాబాద్, హల్దాలో హింస చెలరేగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లను దృష్టిలో పెట్టుకుని మోడీ విమర్శలు గుప్పించారు. మోడీ విమర్శలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. 'ఆపరేషన్ సిందూర్' మాదిరిగా 'ఆపరేషన్ బెంగాల్' చేస్తామని మోడీ వ్యాఖ్యానించడంపై ధ్వజమెత్తింది. ఈ వ్యాఖ్య బెంగాల్ ప్రజలను అవమానించడమేనన్నారు. ప్రతిపక్షం కేంద్రానికి మద్దతుగా విదేశాల్లో అంతర్జాతీయ వేదికలపై ఆపరేషన్ సిందూర్ గురించి టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ గొంతు వినిపిస్తుంటే.. మోడీ మాత్రం రాజకీయ హోలీ ఆడుతున్నారని మండిపడ్డారు. అంతర్జాతీయ వేదికపై కేంద్రాన్ని సమర్థిస్తుంటే మోడీ మాత్రం.. బెంగాల్‌ను కించపరచడానికి ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు జరుగుతున్నాయో తెలియదా? అని ప్రశ్నించారు. మోడీ.. బెంగాల్ మహిళలను అగౌరవపరిచారని.. తాము మాత్రం ప్రతి ఒక్కరినీ గౌరవిస్తామని.. కానీ ఆత్మగౌరవాన్ని పణంగా మాత్రం పెట్టమని చెప్పారు. 'ఆపరేషన్ బెంగాల్' అని చెప్పడానికి మోడీకి ఎంత ధైర్యం ఉండాలి? అదే జరిగితే రేపే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు నిర్వహించండి.. అందుకు సిద్ధంగా ఉన్నట్లు- మమత ప్రకటించారు. ఇక బెంగాల్ సమస్యలపై లైవ్ టీవీ చర్చకు మోడీ సిద్ధమా? అని మమత సవాల్ విసిరారు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం రాజకీయ నాటకాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. గురువారం మోడీ ప్రసంగాన్ని విని షాక్ అయినట్లు- చెప్పుకొచ్చారు. అలాంటి మాటలు వినాల్సి రావడం దుర దృష్టకరం అన్నారు. కేవలం రాజకీయ మైలేజ్ కోసమే కేంద్రం ఆపరేషన్ సిందూర్‌కోడ్ నేమ్ ఉపయోగిస్తోందని ఆరోపించారు.



## ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు

▸వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

▸రాష్ట్రంలో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది ▸ఇటీవలి అల్లర్లలో గుండాలకు స్వేచ్ఛ ▸ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా ▸బెంగాల్ ర్యాలీలో మమతపై విరుకుపడ్డ మోడీ

2లో

**కోల్‌కతా,మే29(సమయజ్యోతి):**

ప్రస్తుతం బెంగాల్ రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్, మాల్డాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. గురువారం పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌దువార్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇండియా... వికసిత్ భారత్‌గా మారాలంటే.. పశ్చిమ బెంగాల్‌ను కూడా వికసిత్ పశ్చిమ బెంగాల్‌గా మార్చడం ముఖ్యమని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు కొత్త శక్తిని నింపాల్సిన అవసరం ఉందని.. జ్ఞానం.. విజ్ఞాన కేంద్రంగా 'మేక్ ఇన్ ఇండియా' కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డు

### ఇదొక గౌరవంగా భావిస్తున్నా: అల్లు అర్జున్

**హైదరాబాద్,మే29(సమయజ్యోతి):**

తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడు(పుష్ప-2) అవార్డు దక్కింది. దీనిపై తాజాగా అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించారు. తనకు ఈ అవార్డును ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. పుష్ప-2 సినిమాకు గాను తొలిసారి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ గౌరవాన్ని నాకు కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన ఘనత అంతా మా డైరెక్టర్ సుకుమార్, ప్రొడ్యూసర్లు, మా మూవీ టీమ్ కే దక్కుతుంది.ఈ అవార్డు నా ఫ్యాన్స్ కు అంకితం చేస్తున్నాను. అభిమానులు చూపించే అవాజ్యమైన ప్రేమ, మద్దతు నాలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి' అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో పుష్ప మొదటి పార్టుకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

## ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత

2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం,మే29(సమయజ్యోతి):**

జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు- జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు- కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాలలో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేదు... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఏ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు



## భారత్ బ్రహ్మోస్‌తో దెబ్బతిన్నాం

ఎయిర్‌బేస్‌లు ధ్వంసం

అయింది నిజమే

మరోమారు

అంగీకరించిన పాక్ ప్రధాని




**న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):**

భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇండియన్ ఆర్మీ ధైర్య సాహసాలు, తిరుగులేని వ్యూహాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇండియన్ ఆర్మీ మిస్సైల్స్ దాడులపై తాజాగా, పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమను ఊహించని దెబ్బ కొట్టిందని అన్నారు. మే 10వ తేదీన తమ ఆర్మీ భారత్‌పై దాడి చేయడానికి అంతా సిద్ధం చేసుకుందని, ఈలోపే భారత్ బ్రహ్మోస్ మిస్సైల్స్‌తో దాడి చేసిందని తెలిపారు.

# ఎప్పుడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షలు

**ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు**

**రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి..సేకరణ**

**ధాన్యం సేకరణలో భద్రాద్రి, ఖమ్మం రికార్డు**

**అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి**

ఖమ్మం,మే29(సమయజ్యోతి):

అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారులతో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంఛార్జ్ మంత్రులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుంటున్నారు.. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది.. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్లలో జమ,ఏశాం.. గతంలో 2, 3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు అని ఆరోపించారు. దీనికి అధికారులకు అభినందనలు.. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి.. దేశంలో ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం.. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు.. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే, సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి.. నకిలీ విత్తనాలు అమ్మేవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు అని ఉప ముఖ్యమంత్రి భట్టి వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. ఇక, ధరణి పోర్టల్ ను పదేళ్లు చూశాం.. ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ధరణిని తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టు-గానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారు.. అందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం పేదలకు అనుకూలంగా ఇది పని చేస్తుందని డిప్యూటీ- సీఎం విక్రమార్క పేర్కొన్నారు. ఇక, తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి అన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి.. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంఛార్జ్ మంత్రికి అప్పగించాలి అని సూచించారు. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పర్చొద్దు.. గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది.. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదు, పూర్తి స్థాయిగా నిధులు విడుదల చేస్తామన్నారు. సీజన్ వ్యాధులకు సంబంధించి కలెక్టర్లు సీరియస్ గా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. తాగునీరు లీకేజీలపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. గతంలో ప్రభుత్వాలు విభాగాలను గాలికి



వదిలేశాయి. కానీ ప్రస్తుతం బడ్జెట్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు, నిధులు విడుదల చేస్తాం అన్నారు. పదేళ్లు వెనుకపడ్డాం. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు. లక్ష్యాలను చేరుకోవాలంటే ఇదే మార్గం అంటూ భట్టి స్పష్టమైన సందేశం ఇచ్చారు.కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్యాకేజీ లభిస్తే..బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం

**ఇలాంటి రాజకీయాలతోనే బిజెపి నష్టపోతోంది**

**లేకుంటే ఎప్పుడో అధికారంలోకి వచ్చేది**

**కవిత వ్యాఖ్యల నేపథ్యంలో రాజాసింగ్**

**సంచలన కామెంట్స్**

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కై-పోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగిందని రాజాసింగ్ అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆయన వాపోయారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని అనుకుంటే ఎక్కడి నుంచి నిలబడాలి అనేది కూడా బీఆర్ఎస్ వాళ్లే డిసైడ్ చేస్తారన్నారు. గతంలో కూడా ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని అన్నారు. ప్రతీ ఎన్నికల్లో తమ పార్టీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీని వల్ల బీజేపీ చాలా నష్టపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ విషయం తెలుసని.. అయినా ఎవరూ బయటపడరన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకు వెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో కార్యకర్తలు, అధికారులు నోరు మూసుకుని కూర్చున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ లేఖను విడుదల చేశారు. అయితే సొంత పార్టీపై విమర్శలు చేయడం రాజాసింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కూడా బీజేపీపై పలు విమర్శలు



చేశారు. పదేళ్ల పాటు- బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పూర్తి స్థాయిలో అధికారపార్టీకి తొత్తులుగా మారేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో చేతులు కలుపుతూ వారికి వంత పాడటం అనేది బీజేపీ రాష్ట్ర నాయకుల్లో కొంతమందికి అలావాటు- అయ్యిందని, పాత స్క్రాబ్‌ను తీసివేస్తే తప్ప పరిష్కారం లభించదంటూ గతంలో కూడా రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే.

# నీచ రాజకీయాలచేసే అలవాటు బిజెపికి లేదు



**పదేళ్లలో కెసిఆర్ ముంచితే..పదినెల్లో రేవంత్ ముంచాడు**

**బిఆర్ఎస్ విలీనంపైతనకు తెలియదు**

**కవిత మాటలను నమ్మడానికి సిద్దంగా లేరు**

**కాలేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతా**

**మీడియాతో ఈటెల రాజేందర్ వెల్లడి**

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

నీచ రాజకీయాలు చేసే అలవాటు బిజెపికి లేదని బిజెపి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నీచ రాజీకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. తెలంగాణ వెలవెలబోతోందని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలన్నారు. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతానని ఈటల తెలిపారు.భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో అపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా అని ఈటల ప్రశ్నించారు. ఇకపోతే కొత్తగా ఎవరు పార్టీ పెట్టినా నమ్మే పరిస్థితి లేదని ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో కలుపుతున్నారన్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు విలీనం కోసం బీఆర్ఎస్ ప్రయత్నం చేయొచ్చన్నారు.. బీజేపీ నుంచి ఎవరూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను కలుస్తానని కవిత అంటోందని.. కవిత కలిసి ఏం చేస్తదని విమర్శించారు. అందులో కొందరు చనిపోయారని.. కొందరు ఇంకెక్కడో ఉన్నారో తెలియదు, మరి కొందరు పార్టీలు మారారని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ముంచితే.. పది నెలల్లోనే రేవంత్ ముంచాడని ఎద్దేవా చేశారు. వీళ్లకు మరోసారి ఓటు వేయద్దొని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. పక్క రాష్ట్రం కేంద్ర సహకారంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఇక్కడ మాత్రం అప్పులతో ఇబ్బంది పడే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీజేపీ వస్తేనే సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కవిత విలీనం కామెంట్లపై ఈటల రాజేందర్ స్పందించారు.. గాలి వార్తలకు నేను ఏం సమాధానం చెప్పాలి.. తెలిస్తే చెబుతా కానీ, తెలియకుండా ఏం చెప్పాలి.. నేను జిమేదార్ ఉన్న రాజకీయ నాయకుడిని.. వాస్తవం ఉంటే మాట్లాడతా, లేకుండా మాట్లాడనని స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

## గుండెధైర్యం ఉన్నవారే యుద్ధాన్ని

# గెలిపిస్తారు

మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు- పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకువచ్చానని గుర్తుచేసుకున్నారు. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికలు, ఓట్ల కోసం కాదు..సైనికుల ఆత్మ స్థయిర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఆపరేషన్ సిందూర్

# ఆగిపోలేదు

ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జీకి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ- ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదని మోదీ దుయ్యబట్టారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.



మొదటి పేజీ తరువాయి

# భారత్ బ్రహ్మోస్‌తో దెబ్బతిన్నాం

పాకిస్తాన్ దాడి చేయడానికి ముందే ఇండియా దాడులు మొదలెట్టింది. పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో లాంగ్ రేంజ్ సూపర్ సోనిక్ బ్రహ్మోస్ క్రూయిస్ మిస్సైల్స్‌తో దాడులు చేసింది. రావల్‌పిండిలోని ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేసిందని అన్నారు. కీలక మిలటరీ బేస్‌లతో పాటు- ఎయిర్‌పోర్టుపై దాడి చేసిందన్నారు. పాకిస్తాన్ మిత్ర దేశం అజర్‌బైజాన్‌లో పర్యటిస్తున్న షహబాజ్ షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అజర్‌బైజాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షరీఫ్ మాట్లాడుతూ.. ' మే 10వ తేదీ ఇండియాపై దాడులు చేయడానికి ఎ÷-లాన్ చేశాం. పాకిస్తాన్ ఆర్మీ దాడులు చేయడానికి అంతా సిద్ధం చేసుకుంది. ప్రార్థనలు పూర్తయిన తర్వాత .. తెల్లవారుజామున 4.30 గంటలకు దాడి చేద్దామని అనుకున్నాం.

## అధికారిక ర్యాలీలో ఉగ్రదాడి సూత్రధారి

**పాక్ వార్షికోత్సవ ర్యాలీలో కనిపించిన సైఫుల్లా కసూరి**

లాహోర్,మే29(సమయజ్యోతి):

పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో దేశ అణు పరీక్షల వార్షికోత్సవ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో రాజకీయ నేతలతో కలిసి పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సైపుల్లా కసూరీ సైతం పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిని తానేనంటూ భారత్ ప్రకటించిందన్నారు. ఈ విధంగా తాను ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించానని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ పేరిట భారత్ జరిపిన దాడిలో మరణించిన ముద్దస్సిర్ షాహిద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లోని అల్హాబాద్‌లో ఆసుపత్రులు, రహదారులను నిర్మిస్తామన్నారు. అలాగే అతడి పేరును ఒక సెంటర్‌కు పెడతామని చెప్పారు. ఇక భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో ఉన్న తల్హా సయీద్ సైతం ఈ ర్యాలీలో పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్మాడు. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ కుమారుడే ఈ తల్హా సయీద్. 2024లో ఆ దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాహోర్ ఎన్ఏ 22 స్థానం నుంచి పోటీ- చేసి ఈ తల్హా సయీద్ ఓటమి పాలయ్యాడు. అతడు పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్‌కు అనుబంధంగా కొనసాగుతున్నాడు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో గతంలో చేసుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. భారత్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ తదితర నగరాల్లో పీఎంఎంఎల్ ఆధ్వర్యంలో భారీగా ఆందోళనలు చేపట్టింది. ఈ ఆందోళనల్లో హాఫీజ్ సయీద్ సైతం పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విమర్శలు గుప్పించిన విషయం విధితమే. ఇక అంతర్జాతీయంగానే కాదు.. పాకిస్థాన్‌లో సైతం లష్కరే తోయిబాపై నిషేధం ఉంది. 2008 ముంబై దాడులకు ఇతడే సూత్రధారి అని ఐక్యరాజ్యసమితి గతంలోనే ప్రకటించింది. అతడు ఈ పీఎంఎంఎల్ వెనుక ఉండి నడిపిస్తున్నాడనే చర్చ బలంగా సాగుతోంది.

# భారతదేశ చరిత్రలోనే వరి సాగులో

# తెలంగాణ నంబర్ వన్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**




గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పండని విధంగా అత్యధికంగా దేశ చరిత్రలోనే తెలంగాణ వరి సాగులో నంబర్ వన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం సుందిళ్ల అన్నారం మేడిగడ్డ బ్యారేజీ లో నుంచి చుక్క నీరు రాకున్నా అధికారుల సహకారం ప్రభుత్వం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల అత్యధికంగా వరి సాగైందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంటల సాగు సన్నద్ధతపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్సింగ్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, చిన్నమైలు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.. భూభారతి వరి ధాన్యం కొనుగోళ్లపై దాదాపు నాలుగు గంటల పాటు మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారెస్పీ రిజర్వాయర్ పూడికతీత, డీ సిల్టేషన్ ఆధునిక పద్ధతుల్లో పూర్తి చేసి పూర్వపు సామర్థ్యం తీసుకొని వస్తామని అన్నారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాలువలు, తూములు, ఓటి మరమ్మత్తు పనులు ఓ అండ్ పి క్రింద పూర్తి చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించి సాగునీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే ప్రతిపాదన రూపొందించాలని వాటికి సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. కరీంనగర్ జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఇందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సాకారంతో ముందుకు వెళ్తానని ప్రకటించారు. 28 మే నాటికి యాసంగి పంట కొనుగోలు కోసం రైతులకు రాష్ట్రంలో దాదాపు 13 వేల కోట్లు చెల్లించామని, గత ప్రభుత్వ హయాంలో ఇదే సమయం 2023 సంవత్సరానికి 3 వేల 500 కోట్లు మాత్రమే చెల్లించారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో రైతులకు మనం 2 వేల 782 కోట్ల చెల్లిస్తే 2023 లో 538 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం 28 మే నాటికి 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే , 2023 లో 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కోనుగోలు చేసిందని పేర్కొన్నారు. సింగరేణి భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బండ్ల వాగు ఎత్తిపోతల పథకాన్ని వారం రోజులలో ప్రారంభిస్తామని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. నీరు అందుబాటులో ఉండి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు.

యాసంగి సీజన్ లో తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున ధాన్యం సాగు జరగలేదన్నారు. దేశంలో వరి పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రాజెక్టులలో ఉన్న నీళ్లు సమర్ధవంతంగా వినియోగించడం వల్ల పెద్ద ఎత్తున పంటలు పండాయన్నారు. సాగునీటిని పొదుపు క్రమంగా వాడటం వల్లే పెద్ద ఎత్తున పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. యాసంగి పంట సన్న రకాల వడ్లను బాయిల్డ్ రైస్ గా మార్చేందుకు ప్రభుత్వం రైస్ మిల్లులో ప్రతిపాదనలు ఆమోదిస్తుందని అన్నారు. ఈ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోను చర్చిస్తామని తెలిపారు. నీటి పారుదల శాఖ పరిధిలో 1100 ఇంజనీర్లు, 1800 మంది లష్కర్లను నియమించామని అన్నారు. సాగునీటిపారుదల శాఖను పూర్తిగా రక్షణ చేశామని తెలిపారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి శాఖను సమగ్రంగా ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు అటవీ అనుమతులు వచ్చేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అందుకోసం అవసరమైన ఉన్నతాధికారులతో నిత్యం సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తమ ప్రభుత్వం కొనుగోలు చేసి తీరుతుందని పేర్కొన్నారు. నారాయణపురం రిజర్వాయర్, కొండగట్టు ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాజకీయాలు ఉండవని మంత్రి తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చెప్పారు. రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కలెక్టర్లు మరో వారం రోజులపాటు కొనుగోలు పట్ల ప్రత్యేక శ్రద్ధ కొనసాగించాలని , జిల్లాలో అవసరమైన మేర ధాన్యం రవాణా కోసం వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా లారీలు కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలులో జాప్యం జరగవద్దని లారీల కొరత ఉన్నచోట ట్రాక్టర్లను ఏర్పాటు చేసి వెంటవెంటనే మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. భారతదేశంలో మొదటి సారిగా రాష్ట్రంలోనే 84% జనాభాకు ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే విప్లవాత్మకమైన పథకమని సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. సన్న బియ్యం సరఫరా వల్ల రేషన్ అక్రమాలు గణనీయంగా తగ్గిపోతాయని, ప్రజలకు 100% ఆహార భద్రత లభిస్తుందని అన్నారు. భారతదేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం అమలు కావడంలేదని మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

> **- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**
>
> **- ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు వానకాలం పంటల సాగు సన్నద్ధతపై**
>
> **ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో సుదీర్ఘంగా సమీక్ష..**
>
> 4లో.

పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ కు నాయకులు సహకరించాలని మంత్రి కోరారు. జ్యూడిషియల్ కమిషన్ నివేదిక ప్రకారం తప్పనిసరిగా చర్యలు ఉంటాయని అన్నారు. మీడియా మిత్రులకు ఎస్సారెస్పీ దగ్గర అందుబాటులో ఉన్న భూములు పంపిణీకి ఉన్న సమస్యలు పరిష్కరించి త్వరలోనే ఇంటి పట్టాలు కేటాయిస్తామని అన్నారు. కరీంనగర్ మీడియా మిత్రులు ఇండ్ల పట్టాల పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో చర్చించి త్వరలోనే పట్టాలు అందించే కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ,లి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాలన దక్షత కారణంగా దేశంలోనే అత్యధికంగా వరి పంట మన తెలంగాణ రాష్ట్రంలో సాగు జరిగిందని, అదే స్థాయిలో భారీ ఎత్తున కొనుగోలు కూడా చేశామని అన్నారు.ఎన్.డి.ఎస్.ఏ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తామని అన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం క్రింద 51 కోట్లు విడుదల చేశామని అన్నారు. తడిసిన ధాన్యం కూడా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. అకాల వర్షాలతో రైతుల నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టాలని అన్నారు.భూ భారతి చట్టంతో పట్టాదారులకు ఎటువంటి నష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పట్టాదారులను భయభ్రాంతులకు గురి చేసి గతంలో పేరు మారిన పట్టాలు సైతం అసలైన అర్హులకు చేరాలని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు సర్వే నెంబర్, యాజమాన్యం, విస్తరణ, బౌండరి వివరాలు ఉండేలా అందిస్తామని అన్నారు.అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలని, పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత వహించి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. ఆయా జిల్లాలో కలెక్టర్లు సమన్వయంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల ఎంపికలో నిబంధనలు పాటించాలని అర్హులైన పేదలకు మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని పేర్కొన్నారు. అనర్హులకు అందిస్తే మాత్రం అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి నిరంతరం జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రైస్ మిల్లుల వద్ద తూకం పేరుతో రైతులు అనేక ఇబ్బందులు గురయ్యారని , ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ ఇబ్బంది రాలేదని అన్నారు. మలక్ పేట, సూరమ్మ, మోతే నారాయణ పూర్, గౌరవెల్లి, దేవాదుల వంటి ప్రాజెక్టు పనులు వేగవంతం పూర్తి చేయాలని కోరారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోకి భూపాలపల్లి హనుమకొండ సిద్ధిపేట జిల్లాలు వస్తాయని ఆయా జిల్లా కలెక్టర్లను సైతం ఉమ్మడి జిల్లా వారి సమీక్ష సమావేశాలకు అధికారులు ఆహ్వానించాలని పేర్కొన్నారు. కలెక్టర్లు రాకపోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండదని కలెక్టర్లు వస్తే వాటిపై చర్చించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ఎక్కడ అవినీతికి ఆస్కారం లేదని అన్నారు. మన ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను సానుకూలంగా ప్రజలలోకి తీసుకొని వెళ్లాలని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి, సన్న రకం ధాన్యం 500 రూపాయల బోనస్, రేషన్ కార్డు సన్న బియ్యం సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె బస్సులు వేయడం వంటి అనేక పథకాలు అమలు చేశామని అన్నారు. కరీంనగర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిందని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో వందల ఇండ్ల నిర్మాణాలను సైతం పూర్తి చేయలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 3500 ఇండ్లను ప్రతి నియోజకవర్గానికి కేటాయిస్తున్నదని తెలిపారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైస్ మిల్లుల దగ్గర ఎక్కడైనా ధాన్యం కోత విధిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పెండింగ్ ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భవిష్యత్తు లో మంజూరు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా ప్రజల్లో మంచి పేరు వచ్చిందని అన్నారు. భూ భారతి సంబంధించి సమస్యల పరిష్కారం బాగా జరుగుతుందని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో 43 వేల 100 ఎకరాల పైగా ఆయకట్టుకు సాగు నీరు కలికోట సూరమ్మ ప్రాజెక్టు ద్వారా అందుతుందని, దీనికి ప్రభుత్వం 320 కోట్లు మంజూరు చేసిందని, భూ సేకరణ నిధులు వస్తే కుడి ఎడమ కాలువ నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని అన్నారు. వరద కాలువ పై 15 కోట్లతో క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. కాళేశ్వరం ప్యాకేజ్ 9 కెనాల్ పనులు పూర్తి చేయాలని, ఎగువ మానేర్ వరకు ఈ నీళ్ళు అందించేందుకు 10 కోట్ల విడుదల చేయాల్సి ఉందని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించిందని త్వరలో పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. తెలంగాణలోని ప్రసిద్ధిగాంచిన వేములవాడ ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. శృంగేరి పీఠం.. ఆగమ శాస్త్రం ప్రకారం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తుల ఇలవేల్పుగా నిలిచే రాజన్న ఆలయాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ డీ -83 కాలువలు పూర్తి స్థాయిలో మీరు రావడం, రాముడు ఎత్తిపోతల పథకం పూర్తి కావడం వల్ల రామగుండం ప్రాంతంలో 40 వేల మెట్రిక్ టన్నుల కు పైగా పంట దిగుబడి వచ్చిందని అన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగిందని , సన్న రకం వడ్లకు బోనస్ అందడంతో రైతులు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు గ్రామీణ ప్రాంతాల్లో మంజూరు చేశామని అన్నారు . పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సింగరేణి కి సంబంధించిన భూములు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బండల వాగు ఎత్తిపోతల పథకం పూర్తయిందని, దీనిని అధికారికంగా ప్రారంభించాలని, అదేవిధంగా పాలకుర్తి ఎత్తిపోతల పథకానికి నీటీ కేటాయింపులు చేసి పూర్తి చేయాలని, పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని కోరారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం వల్ల ఎలాంటి ప్రాంతం భూములకు సాగునీరు అందుతుందని, తద్వారా రైతులకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రైస్ మిల్లుల వద్ద ధాన్యం కట్టింగ్ తో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, ప్రజా ప్రభుత్వం పాలనలో ఎక్కడా కూడా కట్టింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గతంలో ప్రభుత్వం 2 లక్షల 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, నేడు 3 లక్షల 60 వేల పైగా మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసి 91 శాతం రైతులకు చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు. వర్షాకాలం పంట సంబంధించి పెద్దపల్లి జిల్లా రైతాంగానికి 114 కోట్ల సన్న వడ్ల బోనస్ చెల్లించడం జరిగిందని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకుందని, రాబోయే 5 రోజుల లోపు కోనుగోలు పూర్తవుతుందని అన్నారు. సన్న రకం బియ్యం రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తున్నామని అన్నారు. డీ-83, డీ-86 , డీ-89, డీ-91 కాల్వలకు సాగు నీటి ఇబ్బంది పోవాలంటే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం జరగాలని అన్నారు. పెద్దపెల్లి జిల్లాలో రైతులందరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఒకవైపు రైతు రుణమాఫీ మరోవైపు రైతు భరోసా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమ కావడం వల్ల జిల్లాలో రైతులందరూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసిస్తున్నారని తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధికంగా ప్రాధాన్యమిస్తుందని గతంలో ఏ ప్రభుత్వం ఇలా రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాలలో ఉన్న కాల్వ, షెల్టర్ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. డిజైన్ సమస్య వల్ల దెబ్బతిన్న చెక్ డ్యాం మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. జగిత్యాల పరిధిలో ఉన్న లిఫ్ట్. పెండింగ్ బిల్లులు చెల్లింపు పూర్తి చేయాలని అన్నారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని, అటవీ అనుమతులు త్వరగా అందేలా చొరవ చూపాలని ఆయన కోరారు.

సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కులమతాలే రాజకీయ ఎజెండా !

దశంలో కుల రాజకీయాలు మళ్లీ ఊపందుకున్నాయి. కులాల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నది మాత్రరం..అగ్రకులాల వారే. ఇతర కులాల వారికి ఓ బొక్కేసి...వారిపేరు చెప్పి అధికారం చెలాయిస్తున్నారు. అంతే తప్ప వారికి రాజ్యాధికారం మాత్రం అప్పగించడం లేదు. ఎస్సీ,ఎస్టీలకు అధికారం చెలాయించే పదవులు లేనేలేవు. రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము ఉన్నా... ఆ పదవి ఓ ఉత్సవ విగ్రహం లాంటిదే. పార్టీ అధ్యక్ష పదవులు మొదలు సిఎంలు, ప్రధానులు, ఇలా అంతా అగ్రకులాల పెత్తనమే నడుస్తోంది. బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను కేవలం ఓటు బ్యాంక్ చేసుకుని రాజకీయాలు చేస్తూ..అధికార పెత్తనం చెలాయిస్తూ దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టకుండా అడ్డుకుంటున్నారు. కులాల కుంపట్లు రగిల్చి సాధించేదేమీ లేదు. అవతల అన్ని దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం మాత్రం కులాలు, వర్గాలు అంటూ కొట్టుకు చస్తున్నాం. దీనికితోడు సిద్ధాంత నిబద్దత లేని రాజకీయాలు సాగుతున్నాయి. విద్వేషాలు, విభేదాలతో రాజకీయాల్లో నెగ్గుకు కావడం కుదరదు. దేశంలో అనేక తప్పిదాలకు కారణమైన కాంగ్రెస్ ఇప్పుడు ఎదుటి పార్టీని విమర్శిస్తూ అధికరాం కోసం అర్రులు చాస్తోంది. ఇకపోతే అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఎ పదేళ్ల కాలంలో చేసినన్ని తప్పులు లెక్కించడానికి సమయం సరిపోదు. పదేళ్లలో దేశాన్ని వెనక్కి నెట్టిన ఘనులు వీరు. ఆపరేషన్ సిందూర్‌ను విమర్శించడం దారుణం కాక మరోటి కాదు. గతంలో సర్జికల్ స్ట్రయిక్స్‌ను సైతం విమర్శించారు. ఇవన్నీ ప్రజలు ఇంకా మరచిపోలేదు. వీటిని విస్మరించి బిజెపి చేస్తున్న పాలనపై విమర్శలు చేయడం ద్వారా తమ తప్పులను కప్పిపుచ్చు కోవడం కుదరదు. దమ్ముంటే తాము చేసి తప్పులను, తప్పుడు నిర్ణయాలపై చర్చకు రావాలి. ఇకపోతే ఎంతసేపు విభజించు పాలించు అన్న రీతిలో కులమతాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావడం కూడా కుదరకపోవచ్చు. కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే రాజకీయాలను అన్ని పార్టీలు దూరం పెట్టాలి. నిజానికి మైనార్టీల సంతుష్టీకరణతో విభజన రేఖలు గీస్తున్నది రాజకీయ పార్టీలే. అన్ని వర్గాలను సమానంగా చూసే రాజకీయాలు దేశానికి అవసరం. ఇప్పటికే మత ప్రాతిపదికన దేశం విచ్ఛిన్నం అయ్యింది. దేశ విభజన జరిగింది. ఇంకా ఆ పీడకల నుంచి మనం బయటపడలేదు. ఈ క్రమంలో సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎవరు చేసినా..చేపట్టినా నిర్ద్వందంగా ఖండించాల్సిందే. అఘాయిత్యాలను ఎత్తి చూపాల్సిందే. ప్రజా సంక్షేమానికి పోరాడాల్సిందే. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని మంచి పాలన అందించేందుకు అసవరమైన సూచనలు ఇవ్వాల్సిందే. కానీ ఇంకా దేశంలో సగం జనాభాగా అవుతున్న వారిని కూడా మైనార్టీలుగా చూపుతూ.. ఓటు బ్యాంకుగా చూసే దుస్థితి పోవాలి. వారిని ఈ దేశ సంస్కృతి లో భాగంగా చూడాలి. అలాగే సమస్యలను అజెండాగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ప్రధానంగా ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా మేల్కోవడం లేదు. పడికట్టు పదాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి రాజకీయ పబ్బం గడపాలనుకోవడం వారి దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. ప్రజల్లో ఐక్యతా నినాదాన్ని తీసుకుని రావాలి. కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యలపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి. అంతేగాని హిందుత్వ పేరుతో హిందువులను కించపరిచే రాజకీయాలు చేయడం మానాలి. ఎంతసేపు ఆర్ఎస్ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మగా మారిందనీ..మోదీ సర్కారు నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని, హిందుత్వ విధానాలు అవలంబిస్తోందని కాంగ్రెస్, వామపక్ష నేతలు చేస్తున్న విమర్శలు హిందువులను అవమానించడం తప్ప మరోటి కాదు. మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణితో ఉంది.హిందువులు ఏదైనా చేస్తే దానిని భూతద్దంలో చూపించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ముస్లిం తీవ్రవాదాన్ని మాత్రం గట్టిగా ఖండించడంలో నాలుకలు మడతపడే స్తున్నారు. ఇందుకు మొన్నటి పహల్గామ్ దాడి తరవాత ముస్లిం టెర్రరిజాన్ని గట్టిగా కడిగి పారేయడంలో రాజకీయ పార్టీలు వెనకంజ వేశాయి. అందుకే ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో కఠినంగా లెఫ్ట్ ఉండలేక పోతోంది. మతోన్మాద రాజకీయాలను భాజపా సర్కారు ప్రోత్సహిస్తోందని.. అంటున్న వారు ఇస్లామిక్ ఉగ్రవాదుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించి అందుకు అనుగుణంగా ఉద్యమించ లేకపోతున్నారు. వామపక్షాల ఐక్యత అన్నది నినాదంగా మారుతోంది. ఏళ్లుగా ఈ విషయంలో తర్జనభర్జనలే తప్ప కార్యాచరణ లేకుండా పోవడానికి వారి పిడి వాదాలే కారణం. ప్రపంచం అంతా మారుతోంది. ఏ దేశమైనా సమస్యలతోనే పోరాడుతోంది. వీరు నమ్ముతున్న చైనా కూడా ప్రజల సమస్యలను ఎజెండా చేసుకునే పోరాడుతోంది. అయినా అక్కడ ఇస్లాంకు స్థానం లేకుండా అణచి వేస్తున్నారు. దీనిని ఇక్కడి కమ్యూనిస్టులు గుర్తించరు. ప్రస్తావించరు. చైనా తీరును ఎండగట్టరు. కానీ భారతదేశంలో కలసిమెలసి జీవించే విధంగా ప్రజలు ముందుకు సాగుతున్నా..వీరు ఆజ్యం పోస్తుంటారు. ఈ ప్రయత్నాల నుంచి వారు బయటప పడాలి. విపక్షాలు కూడా ప్రజల ఎజెండాతో ముందుకు సాగాలి. అప్పుడే ప్రజలు కూడా ఆదరిస్తారు. కులమతాలను పక్కన పెట్టి పేదల ఆర్థిక అభివృద్ధికి ముందుకు సాగాలి. పేదలు లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి. అప్పుడే దేశం బాగుడపుతుంది.

# నిబద్ధత గల దర్శకులు రాజకీయ వేత్త దాసరి



సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

డా. దాసరి నారాయణరావు మే 4, 1947 న పాలకొల్లు లో జన్మించారు ఆంధ్రప్రదేశ్ కు చెందిన సినిమా దర్శకుడు, రచయిత, నిర్మాత , రాజకీయనాయకుడు.అత్యధిక చిత్రాల దర్శకుడుగా గిన్నిస్ పుటలకెక్కాడు. దాదాపు 170చిత్రాలకు దర్శకత్వం వహించాడు. 58సినిమాలు స్వయంగా నిర్మించాడు. ఈయన 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా లేదా గీతరచయితగా పనిచేశాడు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, తన నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా బహుమతి కూడా పొందాడు.కళాశాలలో చదివేరోజులలో బీ.ఏ డిగ్రీతో పట్టబద్రుడు అవటంతో పాటు దాసరి అనేక నాటకపోటీలలో కూడా పాల్గొనేవాడు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందాడు. ఈయన అనేకమంది కొత్త కళాకారులను సినీరంగానికి పరిచయం చేసి తారలు అయ్యేందుకు దోహదపడ్డాడు. ఒకానొక సమయంలో ఈయన పేరిట 18,000 కు పైగా అభిమానసంఘులు ఉండేవి. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలలో ఈయన ప్రాచుర్యానికి అద్దం పడుతుంది.దాసరి సినిమాలు తాతా మనవడు, స్వర్గం నరకం, మేఘసందేశం, , మామగారు ఈయనకు అనేక అవార్డులు తెచ్చిపెట్టాయి. ఈయన సినిమాలు ముఖ్యముగా స్త్రీ ప్రధానముగా ఉండి వరకట్న సమస్యకు వ్యతిరేకముగా సందేశాత్మకంగా రూపుదిద్దబడినవి. దాసరి తిసిన బొబ్బిలి పులి , సర్దార్ పాపారాయుడు చిత్రాలు నందమూరి తారక రామారావు రాజకీయప్రవేశములో ప్రధానపాత్ర వహించాయి.మామగారు, సూరిగాడు , ఒసేయ్ రాములమ్మా చిత్రాలు దాసరి నటనా కౌశలానికి మచ్చుతునకలు. ఈ సినిమాలలో నటనకు దాసరి అనేక విమర్శకుల ప్రశంసలు , బహుమతులు అందుకున్నాడు.1947, మే 4న పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో జన్మించాడు. దాసరిది పాలకొల్లులో అతిసామాన్యమైన కుటుంబం. ఆస్తిపాస్తులు బాగానే ఉండేవి. దాసరి నాన్నా పెదనాన్నలు కలిసి పొగాకు వ్యాపారం చేసేవారు. ఒకసారి దీపావళి సమయంలో పొగాకు గోడౌన్ తగలబడిపోయింది. అప్పట్లో ఇన్సూరెన్సులు ఉండేవి కాదు. దాంతో ఆర్థికంగా చాలా దెబ్బతిన్నారు. ఆ కష్టకాలంలోనే పొలాలు కూడా అమ్మేయాల్సివచ్చింది. వారు మొత్తం ఆరుగురు సంతానం. ముగ్గురు మగపిల్లలు, ఆడపిల్లలు. దాసరి మూడో వాడు.

వారి నాన్న తరం వరకూ వారి కుటుంబంలో ఎవరూ చదువుకోలేదు. దాసరి వాళ్ళను మాత్రం చదివించారు వాళ్ళ నాన్న. దాసరి ఆరో తరగతి కొచ్చేసరికి వారి ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతింది. స్కూలు ఫీజు మూడుంపావలా కట్టడానికి కూడా డబ్బులేక ఆయన్ను బడి మాన్పించి ఒక వడ్రంగి దుకాణంలో పనిలో పెట్టారు. అక్కడ జీతం నెలకి రూపాయి.ఆరో తరగతిలో ఉత్తమవిద్యార్థిగా ఆయనకు బహుమతి వచ్చింది. అలాంటిది చదువు మానేసి పనిలోకెళ్లాల్సిన దుస్థితి. కానీ ఒక మాస్టారు సాయంతో మళ్ళీ చదువు కొనసాగించాడురాజీవ్ గాంధీ పాలనాకాలములో, దాసరి కాంగ్రేసు పార్టీ తరపున ఉత్సాహవంతముగా ఎన్నికల ప్రచారము సాగించాడు. రాజీవ్ హత్యానంతరం పార్టీకి కాస్త దూరంగా జరిగారు. 1990 చివరిలో ఆయన తెలుగు తల్లి అను ఒక రాజకీయ పార్టీని ప్రారంభించాడు. ఈ పార్టీకి కోస్తా ప్రాంతాలలోని కాపు వర్గాల నుండి మంచి స్పందన లభించింది. ఆ తర్వాత మాత్రం ఆయన కాంగ్రేస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నిక అయ్యాడు. బొగ్గు , గనుల శాఖకు కేంద్రమంత్రిగా కూడా వ్యవహరించాడు. ఈయన కాంగ్రేస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి సన్నిహితుడు. కాంగ్రేస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఆయన కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు నవీన్ జందాల్ నుంచి ?2.25 కోట్లు లంచంగా తీసుకున్నారని ఇద్ది మీద కేసు వేయడం జరిగింది.దాసరి నారాయణరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ సికిందరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో 2017 మే 30న మరణించాడు.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా మే 30 ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణ రావు వర్ధంతి.**

మూడవ పేజీ తరువాయి

# తెలంగాణ నంబర్ వన్

జగిత్యాల పట్టణంలో మంజూరైన 4 వేల 500 ఇండ్లు పూర్తి చేశామని, వీటికి మౌలిక వసతులు కల్పన పనులు పూర్తి చేశామని అన్నారు. అసెస్మెంట్ పట్టాలు ఉన్న రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా చూడాలని అన్నారు. తాను చిన్న వయసులో ఉండగా గ్రామంలో ఇందిరమ్మండ్ల నిర్మాణం చూసానని నాడే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు బాటలు వేసిందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సాగుతున్నదని పేర్కొన్నారు. పేదింటి కలను నెరవేర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని తెలిపారు.చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల, రేషన్ కార్డు వంటి పథకాలు అర్హులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. చొప్పదండిలో పూర్తి స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తున్నామని అన్నారు. నారాయణ పురం రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తి చేశామని, భూ సేకరణ కోసం 23 కోట్లు, ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో 20 విడుదల చేస్తే పనులు పూర్తవుతాయని అన్నారు. కొండగట్టు ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు 22 కోట్ల విడుదల చేయాలని కోరారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే కొండగట్టుతో పాటు మిగతా ఐదు గ్రామాలకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో రైతులు అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొండగట్టు ఎత్తిపోతల పథకం పండ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలను రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సీజన్లో 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మూడు లక్షల 3500 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. దాదాపు 95 శాతం వరి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యాయని, రెండు రోజుల్లో 100% పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో వరి ధాన్యం విక్రయించిన 47 వేల మంది రైతుల ఖాతాలో 671 కోట్లు డబ్బులు జమ చేశామని తెలిపారు. గత సీజన్లో 2,65,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈ సీజన్లో మూడు లక్షల 3500 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని, గతంలో కంటే పెద్ద ఎత్తున వరి సాగు అయిందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై ప్రత్యేక దృష్టిసారించామని జిల్లాలో మొదటి ఫేసులో 2027 మంజురయ్యాయని 990 మార్కింగ్ చేశామని తెలిపారు. 380 గ్రౌండింగ్ పూర్తి చేశామని, 346 ఇండ్లకు పేమెంట్లు కూడా ఇచ్చామని తెలిపారు. సెకండ్ ఫేసులో 5785 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. జిల్లాలో 13 ఇందిరమ్మ మోడల్ హౌస్ ల నిర్మాణం చేపట్టామని, వీటిని జూన్ రెండున ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో యూరియా ఎరువులు విత్తనాల కొరత లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. రైతులు పంటల సాగు విషయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. మార్కెట్లోకి నకిలీ విత్తనాలు రాకుండా ప్రత్యేకంగా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని అందుకోసం ప్రత్యేక నిఘా కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ కోసం 75 కోట్ల అవసరమని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి, కలెక్టర్ తీసుకొచ్చారు. అదేవిధంగా చొప్పదండి నియోజకవర్గం లోని నారాయణపూర్ ప్రాజెక్టు భూసేకరణ కోసం 23 కోట్ల నిధులు అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు అయితే భూసేకరం పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. రైతులకు పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యూరియా ఎరువులు విత్తనాలు కొరత రాకుండా సంబంధిత అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నకిలీ ఎరువులు విత్తనాలు బహిరంగ మార్కెట్లోకి రాకుండా అధికారులతో కలిసి ప్రత్యేక నిజావిభాగం టాస్కోర్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు ప్రణాళికలతో ఉన్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కూడా దాదాపు పూర్తయ్యాయని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై దృష్టి పెట్టామని తెలిపారు. విప్ ఆది శ్రీనివాసు సార్ చెప్పిన అంశం కలికోట సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు 100 కోట్లు అవసరమవుతాయని తక్షణం 30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే భూసేకరణ పై దృష్టి పెడతామని తెలిపారు. మంత్రి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేములవాడ నియోజక వర్గంలో పూర్తిస్థాయిలో సాగునీటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రబీ సీజన్ లో 242 కోనుగోలు కేంద్రాల ప్రారంభించి 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని గత సంవత్సరం కంటే ఇప్పటికే 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా సేకరించామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఉన్న రవాణా సమస్య పరిష్కరించామన్నారు. 150 కొనుగోలు కేంద్రాల్లో 100 శాతం కొనుగోలు పూర్తి చేసి మూసి వేసామని మరో మూడు రోజుల్లో పెండింగ్ కొనుగోలు కేంద్రాల కొనుగోలు పూర్తవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 7 వేల 800 ఇందిరమ్మ మంజూరు చేసామని , రాష్ట్రం లోనే ఇండ్ల మంజూరులో ప్రథమ స్థానంలో సిరిసిల్ల జిల్లా ఉందని అన్నారు. రుద్రంగి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద భూ భారతి ద్వారా 1200 భూ సమస్యలు స్వీకరించామని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే వానాకాలం పంటలు ఎరువులు విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకున్నామని, నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝ, సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జే.అరుణ వివిధ శాఖల ఉన్నతాధికారులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ సర్వేలో సర్వేయర్లు కీలక పాత్ర పోషిస్తారు

**- జిల్లా కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్**

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో మే 29.

సర్వేయర్లు భూ సర్వేలు నిర్వహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఐడిఓసిలోని తన చాంబర్‌లో లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఆమె సర్వే కిట్‌లను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వారికి కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ఎంతో ఆశయంతో భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందని ఆమె అన్నారు. సర్వేయర్లు ఈ చట్టాన్ని పాటించడం ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని ఆమె అన్నారు. శిక్షణ కాలంలో అధికారుల నుండి అన్ని వివరాలను తెలుసుకుని, క్షేత్ర స్థాయిలో క్రమశిక్షణతో భూమి సర్వేలు నిర్వహించాలని ఆమె అన్నారు. జిల్లాలోని 113 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఉదయం మరియు సాయంత్రం 50 రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్, లైసెన్స్ పొందిన సర్వేయర్లు, అధికారులు మరియు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి భూమి పూజ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో గురువారం పంచాయత్ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలకు అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు, మంజూరైన లబ్ధిదారులు త్వరగా పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుందరపు శ్రీనివాస్, కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ జావీద్, మొహమ్మద్ యునుస్, సయ్యద్ రియాజ్ అలీ, సయ్యద్ ఇంతియాజుద్దీన్, డి .సాయన్న, సయ్యద్ రియాజుద్దీన్, సయ్యద్ ముజిపుద్దిన్, షేరు, పాల్గొన్నారు.



# మెరుగైన చికిత్స కోసం రెండున్నర లక్షల ఎల్‌ఓసి అందజేత

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్థికలేమితో చికిత్సకు నోచుకోక అసౌకర్యానికి గురవుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఆర్మూర్ పట్టణ వాసి గాండ్ల జీవన్ కు మెరుగైన చికిత్స అందించడానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి 2.30 లక్షల ఎల్ఓసిని అందజేశారు. జీవన్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గం ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ లు ఇన్చార్జి సబ్ రిజిష్టర్ వివేక్

సమయజ్యోతి న్యూస్ మే 29
బజార్ హత్నూర్ బోథ్



బోథ్ మండల కేంద్రంలోనీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ లు అమలులోకి వస్తాయని ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 24 స్లాట్లు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 24 స్లాట్లు మొత్తం మీద రోజుకు 48 స్లాట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. దీన్ని వేగవంతం చేయడానికి వేలిముద్రలతో పాటు సంతకం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వెబ్ సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు..

# ఈద్-ఉల్-అద్ హా ఏర్పాట్లపై శాంతి కమిటీ సమావేశం

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో మే 29.

ఈద్-ఉల్-అద్ హాసందర్భంగా నిర్మల్‌లో శాంతి, శాంతిభద్రతలు మరియు పరిశుభ్రతకు సమర్థవంతమైన ఏర్పాట్ల కోసం ఆర్డీఓ నిర్మల్ రత్నకలాని అధ్యక్షతన మరియు అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి మరియు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పర్యవేక్షణలో గురువారం నిర్మల్ మునిసిపాలిటీ కార్యాలయంలోని మీటింగ్ హాలులో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈద్-ఉల్- అద్ హా, సందర్భంగా ఈద్ ప్రార్థనల కోసం ఈద్గాను శుభ్రం చేయడం, గుడారాలు మరియు తివాచీలు వేయడం మరియు అభ్యంగన మరియు త్రాగడానికి శుభ్రమైన నీటిని ఏర్పాటు చేయడం, ముస్లిం పరిసరాల్లో మరియు జంతు బలిదానాల మూడు రోజులలో జంతువుల బలిదానాల వ్యర్థాలను వేయడానికి పెద్ద ప్లాస్టిక్ సంచులను అందించడం మరియు పరిశుభ్రత కోసం సమర్థవంతమైన ఏర్పాట్లు చేయడం వంటి మునిసిపాలిటీ కార్యాచరణ ప్రణాళిక గురించి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ సమావేశంలో ప్రసంగించారు. ఈద్‌ను మరింత మెరుగుపరచడానికి హాజరైన వారి నుండి సూచనలు కోరారు. ఈద్‌ను మతపరమైన సహనంతో జరుపుకోవాలని మరియు జంతు బలిదానాల విషయంలో చట్టాన్ని పాటించాలని మరియు ఎవరికీ ఫిర్యాదు చేయడానికి అవకాశం ఇవ్వకూడదని అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి సూచించారు. బలిదానాల జంతువులచట్టపరమైన బదిలీ సమయంలో ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి అనుమతించరాదని ఆయన అన్నారు. ఈద్-ఉల్- అద్ హా, సందర్భంగా జిల్లాలో కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు బలగాలను అప్రమత్తంగా ఉంచామని ఆయన అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ కరుణాకర్ బలిదానాల జంతువులకు సంబంధించిన చట్టపరమైన పరిస్థితుల గురించి పాల్గొన్న వారికి వివరించారు. ఈద్ ప్రార్థనల కోసం ఈద్గాకు వచ్చే ముస్లిం సోదరులకు పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించాలని, టెంట్లు, ఆవరణలు, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించాలని ఆర్డీఓ రత్న కళ్యాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈద్గా ప్రదేశాలలో విద్యుత్ సరఫరాను సమీక్షించి, అవసరమైన చోట మరమ్మతు పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు మరియు పుకార్లను వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అన్ని మతాల పండుగలను సోదరభావం మరియు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈద్-ఉల్-అధా సందర్భంగా ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు మరియు ఈద్‌ను శాంతియుతంగా ఆనందంగా మరియు పరిశుభ్రమైన వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో, ఈద్-ఉల్- అద్ హా, కు సమర్థవంతమైన ఏర్పాట్ల కోసం హాజరైన వారు వివిధ సూచనలను అందించారు. పీస్ కమిటీ సమావేశంలో ఖాజా యూసుఫ్ అహ్మద్, జనరల్ సెక్రటరీ రౌజతుల్ ఉలూమ్ నిర్మల్, హబీబ్ అహ్మద్ అల్ జీలానీ, అధ్యక్షుడు అంజుమన్ ఫరోగ్ ఉర్దూ నిర్మల్, సీనియర్ జర్నలిస్ట్ వసీం షకీల్, ఎంఐఎం అధ్యక్షుడు అజీమ్ బిన్ యాహ్యా, మాజీ హజ్ కమిటీ సభ్యుడు నజీరుద్దీన్, ఎంఐఎం మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ముహమ్మద్ ముజాహిద్ అలీ, రఫీ అహ్మద్ ఖురేషీ, సయ్యద్ అబ్రార్-ఉల్-హసన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు షేక్ అబ్దుల్ సయీద్ సలీమ్, తౌహీదుద్దీన్ రఫు, ఇమ్రానుల్లా, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ మజర్, బీఆర్ఎస్ నాయకుడు గంద్రత్ రమేష్, తెలుగుదేశం నాయకుడు సిర్కొండ రమేష్, అజ్హారుద్దీన్ న్యాయవాది, నాయకులు మహ్మద్ బిన్ అలీ, మహమ్మద్ జావీద్, జుబేర్ హుస్సేన్ ఖాన్, మసూద్ ఖాన్, నయీముద్దీన్, ఫహీం తదితరులున్నారు.



# డివిజన్ను అన్ని విధాల అభివృద్ధి చేస్తా కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

శేరిలింగంపల్లి నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీ లో 93 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సుమారు 23.50 లక్షల తో సీడిపి నిధులతో నిర్మించిన షెటిల్ కోర్టు ను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తో కలిసి గురువారం ప్రారంభించినట్లు కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు డివిజన్ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ అన్నారు సంకల్ప్ గ్రౌండ్ లో బ్యాట్మెంటన్ కోర్టు ను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఆ దిశగా విద్యార్థులు బ్యాట్మెంటన్ క్రీడల పట్ల తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు నూతనంగా నిర్మించి ప్రారంభించుకుంటున్న షెటిల్ కోర్టు చక్కని వేదిక కానున్నదన్నారు సిపార్కు వీధి లో డ్రైనేజ్ సమస్య ఉందని తెలిసి అక్కడికి చేరుకొని కొత్త ప్రతిపాదన పెట్టి జలమండలి అధికారులతో మాట్లాడి సుమారు 10 లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు కాలనీల అసోసియేషన్ సభ్యులు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు భారతి నగర్ డివిజన్ పరిధిలో ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా ఈఎస్ఐ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను ప్రారంభించిన కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి రాత్రి సమయం లో వాహనదారులు ఇబ్బంది పడడం తో పాటు చెత్త వేస్తున్నారని తెలిసి ఈఎస్ఐ ఆసుపత్రి నుండి భేల్ ఎంఎంటీఎస్ వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు అనంతరం డివిజన్ లో ఎంటమాలజీ సిబ్బంది తో మస్కిటో ఫాగింగ్ ను ప్రారంభించిన కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ప్రతి కాలనీ లో దశలవారీగా ఫాగింగ్ చేయాలని ముఖ్యంగా మురికి వాడల్లో కాలువలు కుంటలు నాలాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని అదేశించారు ఈ కార్యక్రమం లో ఎలక్ట్రికల్ జీహెచ్ఎంసీ డిఈ లక్ష్మి ప్రియ ఎంటమాలజీ ఏ ఈ తిరుపతి, సూపర్వైజర్ ఇజాజ్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ మైనార్టీ సర్కిల్ సెక్రటరీ గౌస్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగయ్య యాదవ్ జైపాల్ జాకీర్ ఆనంద్ వెంకట్ రెడ్డి చంద్రమోహన్ రామకృష్ణ మ్యాక్ సొసైటీ జనరల్ సెక్రెటరీ నందగోపాల్ డైరెక్టర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు



# సమయ జ్యోతి న్యూస్ కు స్పందన

సమయజ్యోతి న్యూస్ మే 29 బజార్ హత్నూర్

బజార్ హత్నూర్ మండలం లోని గిర్నూర్ గ్రామం లో రెండవ వాడలో మోచేతుల లింగయ్య పాత ఇల్లు శిథిలావస్తా ఇంటిని తొలగించారు అనే శీర్షిక సమయ జ్యోతి న్యూస్ ఈ నెల 27 ప్రచురితమైంది విదితమే స్పందించినా పంచాయతీ సెక్రెటరీ ఇంటి యజమాని చెప్పడంతో అయన పాత ఇల్లు తీసివేయడం జరిగింది సమయ జ్యోతి న్యూస్ వల్ల మా సమస్య పరిష్కారం అయినందుకు సమయ జ్యోతి న్యూస్ కు కాలనీ వాసులు దన్యవాదాలు తెలిపారు



# జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమావేశం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ లో గురువారం జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ ఆలీ షబ్బీర్ నేతృత్వంలో నిజామాబాదు, కామారెడ్డి జిల్లాల అధికారులు ప్రజాప్రతినిధులతో వరి కొనుగోలు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం, భూభారతి పథకాలపై సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, మదన్ మోహన్ రావు, నూడ చైర్మన్ కేశ వేణ, తాహర్ బి హుందాన్, మానాల మోహన్ రెడ్డి, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఆయా శాఖలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని సాయంత్రం 4.00 గంటలకు కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటు తో పాటు రాజీవ్ యువ వికాసం పథకం లో భాగంగా అదిలాబాద్,బోథ్ నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.అలాగే అన్ని జంక్షన్ లలో కలెక్టరేట్,తదితర ప్రాంతాలలో విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,ఆర్డిఓ వినోద్ కుమార్,ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పథకాల కోసం దళారులను ఆశ్రయించవద్దు

### ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పథకాల కోసం దళారులను ఆశ్రయించవద్దని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు గురువారం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పథకాల అమలుపై ఎంపీడీవోలు ఎమ్మార్వోలు మున్సిపల్ కమిషనర్లు జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ సొంతింటి కలలు సాకారం చేయడమే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇళ్లు మంజూరు కాగా మొదటి విడతలో 1032 మంది లబ్ధిదారులకు నిధుల మంజూరి పత్రాలుఅందజేయడమైనదని నేటి నుండి నియోజకవర్గంలో లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తారని తెలిపారు శు క్రవారం పటాన్చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో లబ్ధిదారులందరూ ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అందించాలన్న



లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం జూన్ 2 న ప్రారంభం అవుతుందని నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ 50 వేల నుండి నాలుగు లక్షల రూపాయల రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు జూన్ రెండున 50 వేల మరియు లక్ష రూపాయల విలువైన యూనిట్ల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలు అందజేయబోతున్నట్లు తెలిపారు ఈ సదవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియం చేసుకోవాలని కోరారు

## జెసిబి ని ఢీకొని వ్యక్తి మృతి కేసు నమోదు చేసిన ఎస్ఐ నవీద్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**



జెసిబి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి 8 గంటలకు జరిగింది. ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడేబల్లూర్ గ్రామానికి చెందిన వడ్డే అంజప్ప తండ్రి బొజ్జప్ప వయసు 33 సంవత్సరాలు గుడెబల్లూర్ నుండి రాయచూరు వాళ్ళ ఇల్లు వద్దకు తన సొంత పనిమీద వెళ్లి తిరిగి రాత్రి అంజదా 8 గంటలకు అక్కడి నుండి గ్రామానికి తిరిగి తన బైకుపై టీఎస్ 38 ఏ 4491 వస్తుండగా దారిలో శివరామరాజు రైస్ మిల్ సమీపంలో జాతీయ రహదారి 167పై జేసీబీ టీఎస్ 04 ఈపి 4277 ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపైకి వస్తుండగా బైకు అదుపుతప్పి ఢీకొన్నది. బైకుపై ఉన్న వ్యక్తి తలకు తీవ్ర గాయాలై ప్రమాద స్థలంలోనే అక్కడికక్కడ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు భార్య వడ్డే జ్యోతి ఫిర్యాదు మేరకు గురువారం జెసిబి డ్రైవర్ మారెప్ప తండ్రి నరసింహులు గ్రామం దాసర దొడ్డి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

## కృష్ణ నదిలో వరద ఉధృతిని పరిశీలించిన మండల తాసిల్దార్ పుష్పలత

**సమయ జ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**

గత వారం రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం కృష్ణానదిలో వరద ఉధృతి కొనసాగుతుంది. ఈ వరద ఉరు ఉధృతిని మండల తహసీల్దార్ పుష్పలత ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి కృష్ణానదిని పరిశీలించారు. జాలర్లు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు. తహసిల్దార్ వెంట రాజు ఉన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని ఇషా బ్లూమ్స్ కాలనీలో 15 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ మాజీ సర్పంచ్ రవి మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి వెంకట్ రెడ్డి నరేందర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి మాజీ వార్డు సభ్యులు స్థానిక నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు



# ముదిరి పాకాన పడ్డ కెసిఆర్ కుటుంబ రాజకీయాలు

కల్వకుంట్ల కుటుంబలో రాజకీయ తుఫాన్

బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్రలు

తనపై లేనిపోని కథనాలు..పెయిడ్ ఆర్టికల్స్

కొందరు నేతలు పనిగట్టుకుని విమర్శలు

కెసిఆర్ మాత్రమే మా నాయకుడు

ఆయనను నడిపించే మొగోళ్లా మీరు

కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం

కెసిఆర్‌కు నోటీసులు వచ్చినా స్పందించని నేతలు

కావాలనే నిజామబాద్‌లో నన్ను ఓడించారు

నా జోలికి వస్తే...నేనసలే మంచిదాన్ని కాదు

కెటిఆర్ లక్ష్యంగా నిప్పలు

### చెరిగిన సోదరి కవిత

**హైదరాబాద్,మే29(సమయజ్యోతి):**

కెసిఆర్ కుటుంబ రాజకీయం ముదరి పాకాన పడింది. రాజీకయ తుఫాన్ చెలరేగింది. తీవ్ర వాయుగుండంగా మారింది. తీరం ఎక్కడ ఎలా దాటుతుందో కానీ..అలజడి సృష్టిస్తోంది.గాలిబుడగలా ఉన్న ఐక్యత పేలింది. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ హైజాక్ చేసి గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై సోదరి కవిత బాంబు పేల్చారు. కెసిఆర్ నాయకత్వం తప్ప ఎవరి నాయకత్వాన్ని అంగీకరించేది లేదని సోదరుడు కెటిఆర్‌కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీని ఇష్టారీతిన నడుపుతూ...బిజెపికి గొడుగు కిందకు చేరుస్తు న్నారంటూ మండిపడ్డారు. వందిమాగధులతో విమర్శలు చేయిస్త ఊరుకునేది లేదని ఘాటు హెచ్చరికలు చేశారు. తనను సవాల్చేయాలనకుంటే ఉఫ్‌న ఊదేస్తానని హెచ్చరించారు. ట్విట్టర్ రాజకీయాలను సహించేది లేదని తేల్చారు. మొత్తంగా అన్న కెటిఆర్‌పై కవిత యుద్ధం ప్రకటించారు. పట్టుతప్పుతున్న పార్టీని కాపాడుకోవడమే తన లక్ష్యమని చెప్పకనే చెప్పారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కవిత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చావిస్తున్నారంటూ మండిపడ్డారు.బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడే కుట్ర మొదలైందన్నారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తారా అని పరోక్షంగా కెటిఆర్ మండిపడ్డారు. జైలుకు వెళ్లేటప్పుడే పార్టీకి రాజీనామా చేస్తానన్నానని తెలిపానని అన్నారు. పార్టీ సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేశారని, తన లేఖ లీక్ చేసిందెవరో చెప్పాల్సిందేనని మండిపడ్డారు. లీకు వీరులను పట్టుకోమంటే, గ్రీకువీరులు దండెత్తారని మండిపడ్డారు. తన జోలికి వస్తే బాగుండదని అంటూనే తానసలే మంచిదానిని కాదన్నారు. కేసీఆర్‌ను తామే నడిపిస్తున్నామని చెప్పు కుంటున్నారని, కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లా మీరు..అని ప్రశ్నించారు. తనపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు వస్తే ఎందుకు నిరసనలు తెలపలేదని, ఇంకో నేతకు నోటీసులు వస్తే ఎందుకు హంగామా చేశారని ప్రశ్నించారు. తాను వాళ్లలా చిల్లర రాజకీయాలు చేయనని, హుందాగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరపున చేస్తున్నానని, కోవర్టులు ఉన్నప్పుడు ఎందుకు పక్కన పెట్టడం లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాయకుడని, పార్టీలో ఇంకెవరి నాయకత్వాన్ని అంగీకరించనని నిర్మొహమాటంగా తేల్చేసారు. మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తన అన్న కెటిఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ ఆమె ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని నిలదీశారు. పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో రాయబారాలు జరిపే అవసరం తనకు లేదన్నారు. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందన్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. పార్టీని బీజేపీలో కలపాలని చూస్తున్నారు. బీజేపీలో విలీనం చేయొద్దని చెప్పాను. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై.. నేను జైల్లో ఉన్నప్పుడే అడిగితే చెప్పాను. 101 శాతం బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఉంటే బీజేపీలో కలపడం కుదరదని.. అందుకే నన్ను కేసీఆర్‌కు దూరం చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న కుట్రలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లోనే ఉన్న కొందరు కోవర్టులు నన్ను ఓడించేందుకు ప్రయత్నించారని, పేయిడ్ న్యూస్‌లు వేసి, లేఖల్ని లీక్ చేసి, బీజేపీలోకి బీఆర్ఎస్‌ను కలిపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండాలంటే ట్వీట్లు- చేయడం మాత్రమే కాదు, కార్యాచరణ చూపించాలి. పార్టీ నడిపించే సత్తా మీకు లేదని నన్ను తప్పుబడుతున్నవారు ముందుగా వాళ్లు ఏం చేశారో చెప్పాలని అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు.తమపై కుట్రలు జరుగుతున్నాయని, తనను బీఆర్ఎస్ నుంచి బయటకు నెట్టాలని ప్రయత్నాలు జరుగు తున్నాయని కవిత ఆరోపించారు. నాకు ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నాడు..ఆయన కేసీఆర్. కొత్త పార్టీలు ఎందుకు..ఉన్న బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను కాపాడితే చాలు. తెలంగాణ జాగృతి ద్వారా నేను పార్టీకి, రాష్ట్రానికి సేవ చేస్తున్నా,అని స్పష్టం చేశారు. నేను పదవులు అడిగినవాళ్లలోని కాదు. కేసీఆర్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో పని చేస్తున్నా. నా కడుపులో బిడ్డ ఉన్నప్పుడు కూడా తెలంగాణ కోసం పోరాడిన నేను.మామూలు నాయకురాలు కాదు. నాతో పెట్టుకుంటే తీపిగా ఉండదని ఇప్పటికైనా గ్రహించాలి,అంటూ కవిత మరోసారి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తనకు రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మావాళ్ళు కొందరు..సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటు న్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించు కుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న వారిని గౌరవిస్తానని కవిత పేర్కొన్నారు.

# ఉనికి కోల్పోతున్న కమ్యూనిస్టులు

## బలమైన ప్రజా ఉద్యమాల నిర్వహణలో విఫలం - కలసి నడవాలన్న ఆలోచనలకు దూరం

**న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):**

దేశంలో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించిన లెఫ్ట్ పార్టీలు ఇప్పుడు చతికల పడ్డాయి. వాటికి ఎజెండా అన్నది లేకుండా పోయింది. బర్దన్, సీతరాం ఏచూరి వంటి మహానేతలు అంతరించడంతో వారి స్థాయినేతలు కానరావడం లేదు. కమ్యూనిస్టులు అనే పదం కాలం చెల్లిందన్న రీతిలో రాజకీయాలు సాగుతున్నాయి. ఇక లెఫ్ట్ ఐక్యత లేదా విలీనం విషయంలో సిపిఐ ఎప్పుడూ ఉదారంగా మాట్లాడుతుంటుంది. కానీ సిపిఐకి బలం లేకుండా పోయింది. ఇటీవల ఉన్న జాతీయ పార్టీ ముద్రను కూడా కోల్పోయింది. ప్రతిసారీ జరిగే లెఫ్ట్ సమావేశాల్లో ఐక్యత, ఐక్య పోరాటల గురించి చెబుతున్నా కార్యాచరణ అన్నది లేకపోవడం కారణంగా కమ్యూనిస్టులు ముందుకు సాగడం లేదు. అందుకే ఒక్కో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతున్నారు. సత్వర రాజకీయ అవసరాలపైనా చర్చించి ప్రజల్లో నమ్మకం కలిగేలా చేస్తే తప్ప లెఫ్ట్‌కు అవకాశాలు లేవనే చెప్పాలి.ఈ క్రమంలో తమ ఆలోచనలకు దగ్గరగా ఉన్న లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించాలి. వామపక్ష ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి. రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా లెఫ్ట్ పార్టీలు ముందుకు రావాలి. ఈ క్రమంలో లెఫ్ట్ పార్టీలు నిర్మాణాత్మక రాజకీయాలకు పూనుకుంటే తప్ప ప్రజలు నమ్మరు. ఇప్పటి నుంచే ఈ రకమైన భావజాలంతో ముందుకు సాగితే ఫలితం ఉండొచ్చు. ఇకపోతే వారు తమ ఉనికిని మరచి రాజకీయాలు చేయడం వల్లనే ప్రజలకు దూరమవుతూ వచ్చారు. ప్రజలను కలుపుకుని పోరాడాలన్న ఆకాంక్ష కమ్యూనిస్టు కార్యకర్తల్లోఉన్నా నేతలు ముందరి కాళ్లకు బంధం వేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు వెంపర్లాడుతున్న లెఫ్ట్ నేతలు సంస్థాగతంగా బలహీనం అవుతున్నాయి. గతంలో కమ్యూనిస్టులకు ఉన్న ప్రజాదరణ కాలక్రమేణా కనుమరుగవుతోంది. మారుతున్న కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకోకపోవడం లేదు. వీరు ఎంతసేపూ మరో పార్టీకి తోకపార్టీగా మారడం మినహా గట్టిగా చేస్తున్న ప్రయత్నాలు చేయడం మానేశారు. ఆయా రాష్ట్రాల్లో పూర్తిగా అదృశ్యం అయిన లెఫ్ట్ పార్టీలు.. ఇతర పార్టీల తోక పట్టుకుని నడిచే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆ పార్టీల్లో ఆత్మవిమర్శ అన్నది మచ్చుకైనా కానరావడం లేదు. పోరాటాల్లో ఆరితేరిన లెఫ్ట్ పార్టీలు ఎందుకనో ప్రజల్లో స్థానం సంపాదించు కోలేక పోతున్నారు. లెఫ్ట్ బలహీనం కారణంగా ఇతర రాజకీయ పార్టీలు తమ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు లెఫ్ట్ పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి కనీసం కూటమిగా అయినా ముందుకు సాగాలి. కానీ కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా కూటమి అవకాశాలను వారే దెబ్బతీస్తున్నారు. విలీనం కావాలన్న ఆశ ఎలాగూ నెరవేర నప్పుడు కనీసం కూటమిగా ముందుకు సాగాలన్న గట్టి నిర్ణయం తీసు కోవడం లేదు. ప్రస్తుతం దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొం టోందనీ.. ఈ దశలో వామపక్షాల ఐక్యత అత్యవసరమని పలు వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, బ్యాంకు ఉద్యోగులు, మేధావులు వేర్వేరు రూపాల్లో నిరసన గళం వినిపిస్తున్నారు. ఇది మరింత విస్తృతమవ్వాల్సి ఉంది. ఇందుకు కమ్యూనిస్టులు నిస్వార్థంగా అడుగులు వేయడం లేదు. అందుకే భాజపా వ్యతిరేకగళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. వామపక్ష కూటమి విదేశాల్లో విజయాలపై చర్చిస్తున్నా దేశంలో మాత్రం అందుకు అనుగుణంగా అడుగులు పడడం లేదు.

# కార్పోరేట్ గుప్పిట్లో ఆర్థిక వ్యవస్థ

## కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ - మాంద్యం నుంచి బయటపడే మార్గమేది?

**న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):**

మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయన్న విమర్శలు ఉన్నాయి. నిజానికి దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోతోంది. తాజా అధ్యయనా మేరకు ధరాఘాతం పేదలను మరింత పేదలుగా మారుస్తోంది. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. కొన్ని కార్పోరేట్ శక్తుల చేతుల్లోనే ఆర్థిక చట్రం ఇమిడి ఉంది. వారు చెప్పినట్లుగానే దేశీయ ఆర్థిక విధానాలు సాగుతున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా ఉండేలా విధానాలు రూపకల్పన చేస్తున్నారు. ఆర్థిక మాంధ్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్న విమర్శలు బలపడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ధరల పెరుగుదల తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. దేశం నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని చెప్పుకోవడం తప్ప ఎక్కడా దాని ఫలితం కానరావడం లేదు. డాలర్ మారకం రేటు అంతకంతకూ పెరుగుతోంది. పెట్టుబడుల వృద్ధిరేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు. చైనాలాంటి దేశాలు ఆర్థిక కట్టుబాట్లను అవలంబిస్తోంది. దేశంలోని అధికార పదువుల్లో ఉన్న వారి ఖర్చుల్లో కోత పెట్టారు. కానీ మనదేశంలో వారికే ఎక్కువ వెసలుబాట్లు ఉన్నాయి. అత్యధిక జీతాలు, భత్యాలు పొందుతున్న వారిలో వారే ముందు వరసలో ఉన్నారు. ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి. సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహద పడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి. దేశ స్ఫూర్తిని పరిరక్షించు కోవడానికి, భాజపా వ్యతిరేక శక్తులను ఐక్యం చేయడానికి ఇదే సరైన సమయం అంటున్న నేతలు అందుకు కార్యాచరణ గురించి చర్చించి ఉంటే బాగుండేది. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు చర్చించడం లేదు. ఓ రకంగా విపక్షాలకు కూడా సరైన ఆర్థిక విధానాలు లేవని అర్థం అవుతోంది.

# అధికారం కోసం రాజకీయ డ్రామాలు

ఎందరో ఉద్యమకారులను

మింగిన బిఆర్ఎస్

అధికారం కోసం ఏమైనా చేసే

కెసిఆర్ కుటుంబం

ఎందరో రాజకీయ జీవితాలను

నాశనం చేసిన ఘనత

కెసిఆర్ ఫ్యామిలీపై మండిపడ్డ

ఎమ్మెల్యే యెన్నం

**హైదరాబాద్,మే29(సమయజ్యోతి):**

బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాయడం, లేఖలోని అంశాలు, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. అలాగే కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న పరిస్థితులపై అధికారపక్ష నేతలు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఇందంతా డ్రామా అటూ కొట్టిపారేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. కల్వకుంట్ల ఫ్యామిలీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు తెరతీశారంటూ మండిపడ్డారు. ఇదంతా కేవలం స్టంట్ రాజకీయమని అన్నారు. భారత దేశం కర్మ భూమి అని.. ఇక్కడి పాపలకు ఇక్కడే శిక్ష అనుభవించాలన్నారు. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారని.. అందులో కవిత పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్ళది అంటూ కల్వకుంట కుటుంబంపై విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని అప్పుడే చెప్పానన్నారు. పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు ప్రజలకు రుద్దారని ఫైర్ అయ్యారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని అన్నారు. దీనితో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారంలోకి రావడానికే కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. కేకే, మహేందర్ రెడ్డిని గెంటేసింది తమరు కాదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన



వేలమంది గొంతులు తడిగుడ్డతో కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం కొత్త సినిమా చూపిస్తోందని అటూ కామెంట్స్ చేశారు. పాలనకు కేటీ-ఆర్ అనర్హుడని కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ అధికారం కోసం మాత్రమే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికార దాహం కోసం చూస్తున్నారన్నారు. కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వీరి డ్రామాలు ఇక చాలించాలని, ప్రజలుకూడా వీరి రాజకీయాలు గమనించాలని అన్నారు.

# కెసిఆర్ ఫ్యామిలీ డ్రామాలు అదుర్స్

## కవిత లేఖ..వ్యాఖ్యలతో మరింత స్పష్టం: ఆది శ్రీనివాస్

**కరీంనగర్,మే29(సమయజ్యోతి):**

బిఆర్ఎస్‌లో రాజకీయ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, డాడీ డాటర్ లేఖపై ప్రజల్లో చర్చ జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని ప్రజలు గ్రహించారన్నారు. అలాగే తాజాగా కవిత వ్యాఖ్యలు చూస్తుంటే ఫ్యామిలీ గొడవులు తారాస్థాయికి చేరాయని అర్థం అవుతోందన్నారు. తెలంగాణ ప్రజలను వంచింది, ఎందరో ఉద్యమకారులను అణచివేసి అధికారం అనుభవించారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదని అప్పులు చేసిన ఘనమైన కుటుంబం వారిదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విచారణ సమయంలో ఇలాంటి డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిజమే అని కవిత లేఖతో స్పష్టమైందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.



# ప్రతికూల వాతావరణం

## ప్రధాని సిక్కిం పర్యటన రద్దు

**న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్కిం పర్యటన రద్దయింది. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన సిక్కిం పర్యటన రద్దు అయింది. అయితే సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా తన సందేశం వినిపించారు. రూ.750 కోట్ల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. కాగా గురువారం నుంచి మూడు రోజుల పాటు- ప్రధాని మోదీ ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. 6 బహిరంగ సభలతో పాటు- రోడ్ షోలు నిర్వహించనున్నారు. సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ లో ప్రధాని పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తన సభల్లో ప్రధాని మోదీ ఫోకస్ చేయనున్నారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈరోజు మోదీ సిక్కిం పర్యటన రద్దయింది. తర్వాత ఆయన రాష్ట్రాల పర్యటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# లేఖలు, లీకులు కాదు.. వాస్తవాలు చెప్పండి

## కవితకు ఎంపి చామల సూటి ప్రశ్న

**న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):**

ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు. ఈరోజు కవిత వ్యాఖ్యలు దాన్ని నిజం చేశాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి కవిత అవసరం లేదని.. తమకు సమర్థమైన నాయకత్వం ఉందని.. తమ పార్టీలోకి కొత్త వాళ్లు అవసరం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# మంచి మాటలే కొండంత ఓదార్పు! (ఆధ్యాత్మిక చింతన )

**తిరుమల,మే29(సమయజ్యోతి):**

మాటలను ఆచితూచి వాడాలి. వినయంగా ఉండాలి. ఎదుటివారికి స్వాంతన కలిగించేలా మాట్లాడాలి. మన ప్రవర్తన ఎదుటివారిలో ధైర్యాన్ని నింపాలి. నేనున్నానని భరోసా ఇవ్వగలగాలి. భగవంతుడు కూడా ఇదే కోరుకుంటాడు. కొంతమంది అకారణంగా మాటల ఈటెలతో ఎదుటివారి మనసును గాయ పరుస్తారు. అది వారి నైజం. శారీరక గాయంలా, మానసిక గాయం బయటికి కనిపించదు గాని ఆలోచనలను అస్థిరపరుస్తుంది. అటువంటివారిని కనిపెట్టి ఉపశమనంగా చెప్పే మాటలు మనసు గాయానికి చల్లదనాన్ని ఇచ్చే లేపనమై కర్తవ్యాసక్తులను చేస్తాయి. అందరూ మానసికంగా దృఢంగా ఉండరు. మానసిక అధైర్యులు ఉంటారు. వారిని కనిపెట్టుకుని ఉండాలి. వీలైనంత వరకు వారితో గడుపుతూ మాటల ఉత్ప్రేరకాన్ని అందిస్తుండాలి. మనసు నెమ్మదించిన మనిషికి ఆకాశమే హద్దు. అలాంటి వారే విజయం సాధిస్తారు. వ్యాకులత చెందిన వారిని దగ్గరకు చేర్చాలి. ధైర్యం కల్పించాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడితే ఎంత ఆనందం లభిస్తుందో అంతటి ఆనందం మంచి మాటల వల్లా కలుగుతుంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటేనే పరమాత్ముడు కూడా అనుగ్రహిస్తాడు. ఆకలిగొన్నవాడికే అన్నం పెట్టాలి. కడుపు నిండిన వాడికి అన్నం పెట్టడం సరికాదు. విజయం సాధించిన వారినే ప్రజలు వెన్నంటి ఉంటారు. అతడిని అంతా తమవారుగా పొగిడేస్తారు. అలా అతడిని అంటిపెట్టుకుని ఎంతోమంది ఉంటారు. అది లోక సహజం. అపజయం పొందిన వ్యక్తికి ఆసరాగా నిలవడమే నిజానికి గొప్ప విషయం. ఆ సమయంలో వ్యక్తపరచే సంఘీభావం ఓటమి పాలైన మనిషికి వెన్నుదన్ను అవుతుంది. తనకు మానసిక ప్రశాంతత ప్రసాదించిన వ్యక్తిని ఎన్నటికీ మరవడు. జీవితమంటే కష్ట సుఖాల కలయిక.. బాధల్లో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వ లక్షణం. అదే జీవితాన్ని నిలబెడుతుందని గుర్తించి మసలుకోవాలి.

# ఫోన్ ట్యాప్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

## మూడ్రోజుల్లో ఇండియాకు రావాల్సిందే-మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు ఆదేశం

న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులోఐపీఎస్ అధికారి, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంలో కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు.. ముందస్తు బెయిల్ కోసం సుప్రీంలో పిటిషన్ వేయగా.. గురువారం విచారణ జరిగింది. ప్రభాకర్ రావుకు తాత్కాలిక ముందస్తు బెయిల్‌ను సుప్రీం కోర్టు మంజూరు చేసింది. అలాగే ఇండియా వచ్చేందుకు పాస్ పోర్ట్‌ను కూడా సుప్రీం ధర్మాసనం మంజూరు చేసింది. మూడు రోజుల్లో ఇండియా రావాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావుకు న్యాయస్థానం ఆదేశించింది. మూడు రోజుల్లో ఇండియా వచ్చి దర్యాప్తునకు సహకరిస్తా అని వెంటనే అండర్ టేకింగ్ ఇవ్వాలని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికిప్పుడు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటి కేసుల్లో ముందస్తు బెయిల్ అంశంపై తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాగా.. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ గతంలోనే తెలంగాణ కోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ ఇస్తే ఇండియాకు తిరిగి వస్తానని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ప్రభాకర్ రావుకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో మే 9న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు ప్రభాకర్ రావు. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే భారత్‌కు తిరిగి వస్తానని పిటిషన్‌లో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారించిన సుప్రీం ధర్మాసనం.. ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో పాటు- వెంటనే ఇండియాకు తిరిగి రావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. . తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ అమెరికాలో ప్రభాకర్ రావు పిటిషన్ వేయగా.. అందుకు అమెరికా ప్రభుత్వం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు జూన్ 20 లోపు కోర్టులో హాజరుకావాలని లేదంటే ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామంటూ నాంపల్లి కోర్టు ఇటీ-వల స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు ఇంటి గోడకు పోలీసులు నోటీ-సులు కూడా అంటించారు. ఇలా ప్రకటిస్తే ప్రభాకర్ రావు ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం దర్యాప్తు సంస్థకు ఉంటు-ంది.

# బనకచర్లతో రాయసీమకు మహర్దశ

## సీమ అభివృద్ధికి ఇక అడ్డు ఉండనే ఉండదు-కడప బహిరంగ సభలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప,మే29(సమయజ్యోతి):

మనకు కేవలం నదులపై ఆనకట్టలు కనిపిస్తే.. చంద్రబాబుకు మాత్రం నదుల అనుంధానం గుర్తొస్తుందని, నిజమైన విజినరీ అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. దానికి కార్యరూపమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి.. కృష్ణా జలాలను బనకచర్ల రిజర్వాయర్ వరకు తీసుకొస్తే.. రాయలసీమ అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ ఉండదని మాధవి రెడ్డి అన్నారు.కడప సభలో ఆమె మాట్లాడుతూ..తెలుగువాడి ఆత్మగౌరవ అగ్నిజ్వాలను నాటి దిల్లీ పాలకులకు తెలియజేయడం కోసం పుట్టిన పార్టీయే తెదేపా అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టి 9 నెలల్లోనే అధికారం చేపట్టి సత్తా చాటారని అన్నారు. అలాంటి పార్టీ బడుగు,బలహీనవర్గాలకు అండగా ఉంటోందని అన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి, రాజకీయ స్వాతంత్ర్యం కోసమే ఈ పార్టీ పుట్టిందన్నారు. మహానాడులో ఆమె మాట్లాడుతూ.. 43 ఏళ్ల తెదేపా చరిత్రలో తొలిసారిగా కడపలో మహానాడు నిర్వహించుకుంటున్నందుకు అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ పార్టీకి క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. రాష్ట్రంలో మొట్టమొదటిసారి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే.. వాటిని రూ. 4 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడిదని అన్నారు. రాయలసీమ కోసం ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును నిర్మిస్తే.. ఎస్ఆర్‌బీసీ, హెచ్ఎన్ఎస్, సీఎన్ఎస్ఎస్, కేసీ కెనాల్‌లను అభివృద్ధి చేసిన చంద్రబాబు.. లక్షలాది మంది రాయలసీమ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూనే.. పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిలో పలు సంస్కరణలను తీసుకొచ్చారని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠిత దీక్ష, నేర్పు, ఓర్పు కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోందన్నారు.

# అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

ఆధార్ కార్డులు

సహా సకల సౌకర్యాలు

నేరాలుచేస్తూ ఇక్కడే


ఉండేలా నైజీరియన్లు

హైదరాబాద్ పోలీస్

కమిషనర్ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

హైదరాబాదులో నేరాలు చేస్తున్న నైజేరియన్స్‌ను డిపోర్ట్ చేస్తున్నట్లు- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డిపోర్టు చేసిన తర్వాత కూడా చాలా మంది నకిలీ పాస్‌పోర్ట్ లతో ఇండియాలోకి ప్రవేశిస్తున్నారని, అలాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేస్తున్నట్లు- వెల్లడించారు. హైదరాబాద్ లో జోనల్ సైబర్ సెల్స్ ను ప్రారంభించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నైజీరియన్లను వాళ్ళ దేశానికి డిపోర్ట్ చేస్తారని భయంతో ఏదో ఒక కేసులో ఇన్వాల్వ్ అవుతున్నారని సంచలన విషయాన్ని తెలిపారు. చివరికి 498 కేసులో అయిన ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించు కుంటున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నైజేరియన్స్ పై కేసు నమోదు అయితే చట్టపరంగా డిపోర్ట్ చేయలేమని స్పష్టం చేశారు. వారిపై కేసు ట్రయల్ పూర్తి చేసి క్లోజ్ అయ్యే వరకు డిపోర్టు చేయలేమని వివరించారు. బంగ్లాదేశ్ కి చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని.. ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు- తెలిపారు. అడ్డదారుల్లో ఇక్కడ ఆధార్ పొందుతున్నట్లు- గుర్తించినట్లు- చెప్పారు. ఈ వ్యవహారంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఎన్ఐఏ నాలుగు చోట్ల సోదాలు చేసిందని.. ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లో సమీర్ తో ఇంకా ఎవరెవరికి లింక్స్ ఉన్నాయనే అంశాన్ని ఎన్ఐఏ దర్యాప్తులో బయటికి వస్తాయని తెలిపారు. అలాగే.. ఫోన్ టాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని సీపీ ఆనంద్ వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా



పాటిస్తామని..ప్రస్తుతానికి ఉన్న చర్యలు అన్ని హోల్డింగ్ లోకి వెళ్లిపోతాయన్నారు. కొత్త పాస్‌పోర్టు జారీ పక్రియ మొత్తం కూడా విదేశీ వ్యవహారాల శాఖ చూసుకుంటుందని.. పాస్‌పోర్టు ఎప్పుడు ఎలా జారీ చేస్తారనే విషయాన్ని తాము కూడా తెలుసుకోవాలన్నారు. ఇంటర్‌పోల్, డిస్పోర్ట్ ఇతర ఇతర చర్యలు అన్ని కూడా హోల్డింగ్ లోకి పోతాయని వెల్లడించారు.

# జూరాలకు అప్పడే వరదపోటు

భారీగా వరదనీటి రాకతో

12 గేట్లు ఎత్తివేత

గద్వాల,మే29(సమయజ్యోతి):

కర్నాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలతో జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల జలాశయానికి భారీగా వరద పోటెత్తుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఇప్పటివరకు 12 గేట్లు ఎత్తి దాదాపు 82వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మరోవైపు, కర్ణాటక, మహరాష్ట్రలలో కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టులో గురువారంఉదయానికి 6,900 క్యూసెక్కుల వరకు ఉన్న వరద నీరు.. మధ్యాహ్నానికి 80వేల క్యూసెక్కులకు పెరిగింది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ 9.657 టీఎంసీలు. అయితే, మధ్యాహ్నం 3గంటల సమయానికి జలాశయంలో నీటినిల్వ 7.682 టీ-ఎంసీలకు చేరింది. సాయంత్రం అరు గంటలకు వరద 66వేల క్యూసెక్కులకు వరద పెరగటంతో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.గత 18ఏళ్ల కాలంలో మే నెలలో జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారని పరీవాహక గ్రామాల ప్రజలు చెబుతున్నారు.మహారాష్ట్రలోని ఉజని డ్యాం పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా జలాశయంలోకి వరద పోటెత్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. గురువారం రాత్రి వరకు జూరాలకు వచ్చే వరద లక్ష క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని జూరాల ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

# గద్దర్ అవార్డులపై చిరంజీవి హర్షం

అవార్డు దక్కిన వారికి

శుభాకాంక్షలు

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2024పై అగ్ర కథానాయకుడు చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు దక్కించుకున్న ప్రతి ఒక్కరికీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు చెప్పారు. అవార్డుల సంప్రదాయాన్ని పునరుద్ధరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌కు ఎంపి-కై-న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు నిజంగా ఎంతో విలువైనది. సృజనాత్మక రంగంలో ఉన్న ప్రతి నటు-డు, -టె-క్నీషియన్‌కు ఎంతో ప్రేరణనిస్తుంది. అద్భుతమైన సంప్రదాయాన్ని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించటం, ఎంతో గొప్ప ప్రోత్సాహాన్నిస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధితశాఖ మంత్రులు, అధికారులకు, అవార్డుల కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చిరంజీవి తెలిపారు. గద్దర్ అవార్డుల ప్రకటనపై అగ్ర కథానాయకులు అల్లు అర్జున్, ఎన్టీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. 'కమిటీ- కుర్రోళ్లు' చిత్ర నిర్మాత నిహారిక కొణిదెల, చిత్ర బృందం సైతం సంతోషం వ్యక్తం చేసింది. ఈ చిత్రానికి జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డు వచ్చింది.

# ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో అలసత్వం తగదు

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

ఇందిరమ్మ ఇళ్ల జాబితా రూపకల్పనలో అలసత్వం తగదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నిబంధనల మేరకు జాబితా సిద్ధంచేయాలన్నారు. నిర్దేశిత సమయానికి లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల మంజూరులో నిర్లక్ష్యం తగదన్నారు. జూన్ 6లోపు లబ్దిదారుల జాబితా తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. లబ్దిదారుల జాబితాతో ప్రొసీడింగ్స్ కాపీలను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పని చేయాలన్నారు.

# కేసీఆర్ అసలు రంగు బయటపడింది: బీర్ల ఐలయ్య

హైదరాబాద్,మే29(సమయజ్యోతి):

కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపాలని ఆయన చూసినట్లు- బయటపడిందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు రావడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయడానికి ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయని చెప్పారు బీర్ల ఐలయ్య. కేసీఆర్ ఎందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారో కవిత బయట పెట్టాలని బీర్ల ఐలయ్య కోరారు. కేటీఆర్ బండారాన్ని కవిత బయట పెట్టిందని చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి కవితను బయటకు పంపించడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లిని చూసి ఓర్వలేని కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలను ఎలా గౌరవిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో డీల్‌పైన బీఆర్ఎస్ కార్యకర్తలకు సమాధానం చెప్పాలని కోరారు. కుటు-ంబాన్ని చక్కపెట్టుకోలేని కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతారా అని బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి చేరిన మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు

## మంత్రివర్గంలో చోటు కోసం డిమాండ్

న్యూఢిల్లీ,మే29(సమయజ్యోతి):

తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకిచేరింది. కేబినేట్‌లో తమకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజికవర్గం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామన్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటు-లోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# పాక్ గూఢచర్యలో ప్రభుత్వ ఉద్యోగి

జైసల్మేర్‌లో షకుర్ ఖాన్ అరెస్ట్

సంబంధాలపై పోలీసులు ఆరా

జయపుర,మే29(సమయజ్యోతి):

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వోద్యోగి షకుర్ ఖాన్‌ను బుధవారం రాత్రి జైసల్మేర్‌లో నిఘా అధికారుల బృందం అరెస్ట్ చేసింది. షకుర్ ఖాన్‌పై గత కొన్ని వారాలుగా దర్యాప్తు బృందాలు నిఘా పెట్టాయి. పాక్ దౌత్య కార్యాలయంతో సంబంధాలు ఉన్నట్లు- అనుమానిస్తున్నారు. ఉన్నత స్థాయి సమాచారం మేరకు షకుర్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుధీర్ చౌదరి తెలిపారు. ఇక షకుర్ ఖాన్ ఫోన్‌లో పలువురి పాకిస్థానీయుల నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి గురించి సరైన సమాధానం ఇవ్వలేనట్లుగా తెలుస్తోంది. అతను పాకిస్థాన్‌కు ఏడు సార్లు వెళ్లినట్లుగా గుర్తించారు. అయితే మొబైల్స్‌లో కొన్ని ఫైల్స్ డిలీట్ అయినట్లుగా కనిపెట్టారు. అలాగే బ్యాంక్ ఖాతాలపై కూడా దృష్టి పెట్టారు. ఇటీవలే ఒక ఖాతా క్లోజ్ అయింది. దానిపై కూడా ఆరా తీస్తున్నారు. షకుర్ ఖాన్ తరచుగా మొహమ్మద్ తండ్రి ఘాజీ ఫకీర్‌ను కలిసేవాడని స్థానికులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో షకుర్ ఖాన్, మొహమ్మద్, ఘాజీ ఫకీర్ ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. ఇక 2021లో ఘాజీ ఫకీర్ మరణించారు. మే 7న ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ సరిహద్దులో జైసల్మేర్‌పై అధికారులు నిఘా పెట్టినట్లుగా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ చౌదరి తెలిపారు. సరిహద్దులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను ప్రశ్నించడానికి అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం అదుపులోకి తీసుకున్న ఏడో వ్యక్తి షకుర్ ఖాన్ అని వెల్లడించారు.

# యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

చెన్నైలో అదుపులోకి తీసుకున్న

ఎన్ఐఏ అధికారులు

చెన్నై,మే29(సమయజ్యోతి):

యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. చెన్నై విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే సన్నీ యాదవ్ బైక్‌పై పాకిస్థాన్ వెళ్లి వచ్చాడు. దీంతో పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పాకిస్థాన్‌లో ఎవరితోనైనా సంబంధాలు కలిగి ఉన్నాడా? ఎలాంటి గూఢచర్యం చేశాడన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన జ్యోతి మల్హోత్రాతో సహా పలువురిని జాతీయ దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ అధికారులతో చాలా క్లోజ్‌గా తిరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు-గా గుర్తించారు. ఇక జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన యూట్యూబ్‌లో పాకిస్థాన్‌కు సంబంధించిన అనేక వీడియోలు ఉన్నాయి. ఆమె పాకిస్థాన్‌కు మూడు సార్లు వెళ్లి వచ్చింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడికి ముందు కూడా జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు-గా గుర్తించినట్లు- సమాచారం. పహల్గామ్‌కు సంబంధించిన వీడియోలను జ్యోతి మల్హోత్రా.. పాక్ అధికారులకు చేరవేసినట్లు- అనుమానించారు. ప్రస్తుతం ఆమె హర్యానా జైల్లో ఉంది. 9 రోజుల పాటు- ఆమెను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని హతమార్చారు. అనంతరం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలు నిలిపేసింది. పాక్ వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దును మూసేసింది. అనంతరం మే 7న భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి.

# ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**వికారాబాద్,మే29(సమయజ్యోతి):**

ప్రమాదవశత్తు నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల గ్రామానికి చెందిన గొల్ల మహేష్ (11), కుక్కలి శివతేజ్ (11) ఇద్దరు విద్యార్థులు గుండాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదవ తరగతి పూర్తి చేసుకున్నారు. వేసవి సెలవులు కావడంతో గురువారం ఉదయం ఇద్దరూ స్నేహితులు పొలంకు వెళ్లి వస్తామని ఇంటి దగ్గర చెప్పి వెళ్లారని ఇంటి నుంచి వెళ్లి గుండాల గ్రామ శివారులో శ్రీకాంత్ రెడ్డి అనే రైతు పొలంలో తవ్విన గుంత దగ్గర ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారిపోయి పడి చనిపోయారని తెలిపారు. మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

# ఒకే కుటుంబంలో కోవిడ్ నిర్ధారణ

**రాజన్న సిరిసిల్ల,మే29(సమయజ్యోతి):**

సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలో కోవిడ్ కేసుల కలకలం పలువురిని ఆందోళన గురిచేస్తుంది. గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో గత కొన్ని రోజులుగా జ్వరం, నాలుక రుచి,ముక్కు వాసన కోల్పోవడంతో సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాలలో కోవిడ్ పరీక్షల కోసం వెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించడం లేదని ఆసుపత్రి బాధ్యులు చెప్పడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయించుకున్నారు. పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కుటు-ంబీకులు అప్రమత్తమయ్యారు. ఈ సంఘటనపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ ఆఫీజాను వివరణ కోరగా రాపిడ్ టెస్టుల్లో పాజిటివ్‌గా వచ్చిందని కోవిడ్ నిర్ధారణ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించామని ప్రస్తుతం ఆ కుటు-ంబాన్ని క్వారం-టైన్‌లో ఉంచామని తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

# కిడ్నీ రాకెట్ కేసులో సిఐడి ముమ్మర దర్యాప్తు

## మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మే29(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. సరూర్‌నగర్ అలకనంద హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో సీఐడీ ముమ్మరంగా దర్యాప్తు జరుపుతోంది. కిడ్నీ రాకెట్ కేసులో పరారీలో మరో ఏడుగురు నిందితులు ఉన్నారు.గతంలో 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేస్ సీఐడీకి బదిలీ అయిన తర్వాత ఇద్దరినీ తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన శంకరన్, రమ్య అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి దగ్గరి నుంచి పాస్‌పోర్ట్‌తో పాటు- రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలో అదుపులోకి తీసుకొని ట్రాన్సిట్ వారెంట్ మీద హైదరాబాద్‌కు తరలించారు. తమిళనాడులో పేదవారిని టార్గెట్ చేసి కిడ్నీ డొనేట్ చేయించినట్లు- అధికారులు గుర్తించారు. ఒక్కో ఆపరేషన్‌కు రూ. 10 లక్షలమేర నిందితులు వసూలు చేశారు. కిడ్నీ డొనేట్ చేసిన వారికి నిందితులు రూ.4 లక్షలు చెల్లించినట్లు- అధికారుల విచారణలో తేలింది. కాగా, అలకనంద ఆస్పత్రిలో జరిగే కిడ్నీ ఆపరేషన్లపై అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్నట్లు- చెప్పారు. ఈ విషయంపై సంబంధిత ఆస్పత్రి యాజమాన్యాన్ని సీఐడీ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నాయి. దర్యాప్తు ముమ్మరంగా జరుపుతున్న కొద్దీ ఈ రాకెట్‌కు దేశవ్యాప్తంగా ఉన్న లింకులు బయటపడుతున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు కొనసాగించినట్లు- అధికారులు గుర్తించారు. సీఐడీ అధికారులు ఇప్పటికే సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. నిందితుల మొబైల్ ఫోన్లు, వాటిలోని వాట్సాప్ చాట్స్, బ్యాంకు లావాదేవీలు, సీసీ టీ-వీ ఫుటేజీల ఆధారంగా అధికారులు విచారణ చేస్తున్నారు. ఇదే క్రమంలో పాసుపోర్టులను, విదేశీ కాల్‌లాగ్స్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు. ఏ ఒక్క నిందితుడు తప్పించుకోలేనంతగా ఫోరెన్సిక్ ఆధారాలను అధికారులు సేకరిస్తున్నారు.

# ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ లో అటవీశాఖ అధికారులు ప్రతిపాదిత టూరిజం స్థలా పరిశీలన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఎకో టూరిజంలో భాగంగా బాల్కొండ మండలంలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ జలాల్పూర్ సమీపంలో చేపట్టే ఎకో టూరిజం స్పాట్ ను గురువారం అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సునీత భగవత్, అధికారులతో కలిసి పరిశీలించారు. టూరిజంకు కావలసిన భూమి వివరాలు, గతంలో చేపట్టిన సర్వే వివరాలను ఆరా తీశారు. రైతుల అభిప్రాయాలను సేకరించి వారి వివరాలను తెలుసుకున్నారు. సాధ్య సాధనాలను ఆరా తీసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో 15 రోజులలో పనులను ప్రారంభించనున్నారు. వారి వెంట డీఎఫ్ఓ వికాస్ మీనా, ఎఫ్డిఓ భవాని శంకర్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రణవీర్, సెక్షన్ ఆఫీసర్ గణేష్ ఇరిగేషన్ అధికారులు,రెవెన్యూ అధికారులు గ్రామస్తులు ఉన్నారు.



# ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

## తొలి బడి అమ్మ ఒడి .. మలి బడి అంగన్‌వాడీ-సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క

**భద్రాద్రి కొత్తగూడెం,మే29(సమయజ్యోతి):**

తొలి బడి అమ్మ ఒడి అయితే... .. మలి బడి అంగన్‌వాడీ బడి అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు,సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా మంత్రి పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి రోడ్డు వద్ద 6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు-చేసిన ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, పిల్లలందరికీ నర్సరీ పాటలతో పాటు- ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తల్లిదండ్రుల కష్టాలు వృదా చేయకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటు-గా తయారు చేస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి 57 రకాల ఆట వస్తువులను అందుబాటు-లో ఉంచామన్నారు. త్వరలోనే గర్భిణులు కింద కూర్చోకుండా అన్ని కేంద్రాల్లో బల్లలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పథకం కింద మంజూరైన రూ.74.64 లక్షల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎసే వారు ఏర్పాటు-



చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి వేస్ట్ నుంచి బెస్ట్ రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. ఆడపిల్లలకు శక్తినిద్దాం... ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటీ-డీఏ పీవో రాహుల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... కౌమార బాలికల్లో రక్తహీనత నివారించేందుకు ఇందిరమ్మ అమృతం పేరుతో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమరంభీం ఆసీఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు- తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాలో 50,269 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మీ, సీపీవో సంజీవరావు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ రామచంద్రారెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తాం సిపిఎం

**సమయజ్యోతి న్యూస్ అచ్చంపేట**

అచ్చంపేట మండలం ఐనోల్ గ్రామంలో కామ్రేడ్ బూసి రామచంద్రారెడ్డి 16వ వర్ధంతిని ఐనోల్ గ్రామంలో సిపిఎం అచ్చంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సభకి వర్ధం సైదులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కామ్రేడ్ రామచంద్రారెడ్డి చిత్రపటానికి వారి కుమారుడు మణిపాల్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేశనాయక్ గారు రావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలను కూలీలను కూడగట్టి ఎర్రజెండాకి వన్నె తెచ్చిన గొప్ప నాయకుడని వారు అన్నారు. పేదల కోసం కష్టజీవుల కోసం నిరంతరం ఎర్రజెండా నీడలో పనిచేసిన ఉద్యమ నాయకుడని వారు అన్నారు. గ్రామంలో సిపిఎం సర్పంచిగా పోటీ చేసి గ్రామ అభివృద్ధికి పాటుపడిన వీరుడని ఆయన గొప్ప పలికారు. గ్రామంలో ఉన్న కొంతమందికి భూదానం చేసిన ప్రధాత కామ్రేడ్ రామచంద్రారెడ్డి ప్రజల హృదయాలలో నిలిచిపోయారని వారు అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ప్రజలకి కార్మికులకి అందుబాటులో ఉండి ప్రజలకి ఏ కష్టం వచ్చినా నేనున్నానని ధైర్యం చెప్పిన గొప్ప త్యాగశీలి. అచ్చంపేట ఐనోలు సింగారం, బొమ్మనపల్లి, చందాపూర్, సిద్దాపూర్ గ్రామాలకు ఎర్రజెండాలు ఎగిరేసిన చరిత్ర కామ్రేడ్ రామచంద్రారెడ్డికి మాత్రమే ఉందని అన్నారు. రామచంద్ర రెడ్డి గారు లేకపోవడం చాలా బాధాకరమని వారి కుటుంబ సభ్యులు పార్టీకి నిరంతరం సేవలందించాలని నేడు దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకి కార్మికులకు ఇచ్చిన హామీలను



తుంగలో తొక్కుతున కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్రంలో రైతులకి లేబర్ కోట్లు తెచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ రామచంద్రారెడ్డి కుమారులు భూపాల్ రెడ్డి మణిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు మరియు సిపిఎం మండల కార్యదర్శి వి. సైదులు, సీనియర్ నాయకులు బి.రాములు, శివకుమార్, పర్వతాలు మహిళా సంఘం జిల్లా నిర్మల సైదమ్మ,మాజీ సర్పంచ్ లింగారెడ్డి, అంతయ్య వెంకటయ్య,చంద్రయ్య బుచ్చయ్య, బాలయ్య గ్రామ ప్రజలు సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## - ధాన్యం బస్తాల దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**



జిల్లా కేంద్రానికి సమీపంలో గల అర్సపల్లి, ఖానాపూర్, సారంగాపూర్ ప్రాంతాలలోని రైస్ మిల్లులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి అర్సపల్లిలోని రుద్రా రైస్ మిల్లును, ఖానాపూర్ లోని ఎల్.జీ ఆగ్రో ఇండస్ట్రీస్, వీరభద్ర రైస్ మిల్లు, సారంగాపూర్ లోని అనూ ఫుడ్స్ రైస్ మిల్లులను సందర్శించారు. ఆయా మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ముందస్తుగానే రుతు పవనాల ప్రవేశంతో వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని, చివరి దశలో మిగిలిన ధాన్యం నిల్వలను కూడా సకాలంలో దిగుమతి చేసుకుని సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆదివారాల్లోనూ రేషన్ పంపిణీ

## జూన్ 1 నుంచే అమలుకు నిర్ణయం

## పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి,మే29(సమయజ్యోతి):**

జూన్ 1 నుంచి దివారాల్లోనూ రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం అని, రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు. మార్కెట్‌లో ధరల పెరుగుదల ఉంటే.. సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీకి ప్రభుతం అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 29,760 రేషన్ డిపోల ద్వారా ఇచ్చేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు- పూర్తి చేసింది. విజయవాడ మధురానగర్‌లోని 218 రేషన్ షాపులో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ స్వయంగా పరిశీలించారు. ఈపోస్ మిషన్, ఎలక్ట్రానిక్ కాటా పని తీరును దగ్గరుండి మరీ చెక్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తాం. 29,760 షాపుల్లో అన్ని ఏర్పాట్లు- చేశాం. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో మాయ చేసింది. వేల కోట్లు- దుర్వినియోగం అయ్యేలా చేశారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం. రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈకేవైసీ 96 శాతం పూర్తి చేశాం.. దేశంలోనే ఇది ఒక రికార్డు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు.'కోటి 46 లక్షల రేషన్ కార్డులు ఏపీలో ఉన్నాయి. జూన్ ఒకటి నుంచి 4.40 లక్షల మందికి సరుకులు ఇస్తున్నాం. మార్కెట్‌లో ధరలు పెరుగుదల ఉంటే సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తాం. ప్రతి రేషన్ షాపు ఫొటో తీసి యాప్ ద్వారా ఆన్ లైన్లో ఉంచాం. అన్ని షాపులకు ఈ సాయంత్రానికి సరుకులు చేరుతాయి. ఈపోస్ మిషన్, కాటా, సర్వీసింగ్ ఉచితంగా చేయిస్తున్నాం. నేడు రాష్ట్ర వ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించాం. 218 షాపు డీలర్ పసుపులేటి శివప్రసాద్ ముప్పై యేళ్లుగా డీలర్‌గా ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్లకే వెళ్లి సరుకులు అందజేస్తాం. అన్ని విధాలా డీలర్లను కూడా ఇందుకు సన్నద్ధం చేశాం. 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయి. ఎండియూలు పది శాతం డబ్బులు కట్టారు. మిగతా డబ్బు కార్పొరేషన్ ద్వారా కట్టి.. వాహనాలు వారికే ఇస్తున్నాం. ప్రజలు కూడా రేషన్ షాపుల ద్వారానే ఇవ్వాలని కోరుతున్నారు. 15 రోజుల్లో వారికి వీలున్న సమయాల్లో సరుకులు తెచ్చుకుంటారు. 29,760 రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ ఉంటు-ంది. మార్కెట్లో పెరిగే వస్తువులను బట్టి.. రేషన్ షాపుల్లో



తక్కువ ధరకే అందిస్తాం. ప్రతి కుటు-ంబానికి ఆహార భద్రత కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం' అని మంత్రి నాదెండ్ల తెలిపారు.

# సొంతవారి కోసమే చంద్రబాబు సంక్షేమం

## పేదలను విస్మరించి సాగిస్తున్న పాలన

## మీడియా సమావేశంలో

## మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని

**అమరావతి,మే29(సమయజ్యోతి):**

సొంతవారికి దోచిపెట్టేందుకే చంద్రబాబు పాలన చేస్తున్నారని, అర్థిక అభివృద్ధి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు తన మనుషులకే మేలు చేస్తున్నారని మాజీ మంత్రి విడదల రజని మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అనేది చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. మహమ్మారి కరోనా సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారని, చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారి పోయాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని ఏం చేయదలచుకున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, జనాలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు అని విడదల రజని నిలదీశారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతులు రోడ్డెక్కారు, పరిశ్రమల ఊసే లేదు. అర్థిక అభివృద్ధి పేరుతో బాబు తన మనుషులకే మేలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అనేది ఆయనకు ఇష్టం లేదు. కరోనా సమయంలో వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారు. కానీ చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఇప్పుడు ఏదడిగినా పీపీపీ పద్ధతి అంటు-న్నారు. మెడికల్ కాలేజీల ద్వారా ఆరోగ్య సేవలను జగన్ గారు విస్తృత పరిచారు. రాష్ట్ర ప్రజలకు మంచి వైద్యం అందించాలని ఆయన భావించారు. 17 మెడికల్ కాలేజీలను తెచ్చారు. వైద్య విద్య చదివే వారి ఆశలను నిజం చేయాలని జగన్ చూశారు. కార్పొరేట్ స్థాయిలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు- చేయాలని జగన్ భావించారు. నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించటానికి అడుగులేశారు. అలాంటి మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రయివేటీ-కరణ చేస్తున్నారు. ఒక సంస్థతో సర్వే చేయించినట్టుగా కథ నడిపి వారితో రిపోర్టును తెప్పించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వారికి అనుగుణంగా రిపోర్టు ఇచ్చారు. ఒక్కో కాలేజీని సంవత్సరానికి 5 వేల చొప్పున లీజుకు ఇస్తున్నారు. 5 వందల కోట్ల విలువైన ఆస్తిని 5 వేలకు ఇవ్వటం ఏంటి?' అని మాజీ మంత్రి విడదల రజని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని చంద్రబాబు నాయుడు ఏం చేయదలచుకున్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాబు ప్రజలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవటం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యత నుండి చంద్రబాబు ప్రభుత్వం తప్పుకోవడం సరికాదు. మేము అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై రివ్యూ చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కోసం వైఎస్ జగన్ అనేక ఏర్పాట్లు- చేశారు. ఇప్పుడు వాటిని కూడా ఈ ప్రభుత్వం నాశనం చేసింది. గిరిజనులకు మరలా డోలీల బాధ తప్పటం లేదు' అని విడదల రజని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాయలసీమ అడ్డా..టిడిపి గడ్డ

## దేవుని గడపలో మహానాడు సూపర్ సక్సెస్

## వైనాట్ 175 అంటే..ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు

## తాడేపల్లి ప్యాలెస్‌కే జగన్‌ను పరిమితం చేశారు

## ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతాం

## త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

## అప్పల ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిన జగన్

## రెడ్‌బక్ అంటేనే వణికిపోతున్న నేతలు

## కడప బహిరంగ సభలో లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు



**కడప,మే29(సమయజ్యోతి):**

దేవుని కడపలో మహానాడు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. తిరుమల తొలి గడప.. దేవుని కడప. దేవుని కడప, ఒంటిమిట్ట, అమీన్‌పీర్ దర్గా ఉన్న పుణ్యభూమి. పౌరుషం, ఆత్మీయత, మహిళలను గౌరవించడం నేర్చుకోవాల్సిన గడ్డ ఇది. మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు జెండా రెప రెపలాడుతోందని అన్నారు. మహానాడు బహిరంగ సభలో తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. 2024లో మాస్ విక్టరీ మనందరం చూశాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రను తిరగరాశాం. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటు దెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు, పార్టీ లేకుండా చేస్తామన్నారు.. కానీ వారే  అడ్రస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు.. వారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని నారా లోకేశ్ అన్నారు. 175 నియోజకవర్గాలకు గాను 164 సాధించాం ఇది ఆల్ టైం రికార్డ్ అని పేర్కొన్నారు. జెండా పీకేస్తాం అన్నారు.. ఇప్పుడు వాళ్ళ పార్టీ ఆఫీసుకు టూలేట్ బోర్డు పెట్టారని ఆరోపించారు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేశారు.. ప్రజలు ఇప్పుడు ఫుట్‌బాల్ ఆడుకునే పరిస్థితి వచ్చింది. ఏ తప్పూ చేయని మన అధినేత చంద్రబాబును జైల్లో పెడితే.. ప్రజలు జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టి లాక్ చేశారు. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు.. ట్రెండ్ సెట్ చేస్తారు. అది సినిమా స్క్రీన్ అయినా..పొలిటికల్ స్క్రీన్ అయినా.. ఆయన ఒక లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, భీముడు, కర్ణుడు అంటూ గంభీరఉపన్యాం ఇచ్చారు. సీబీఎన్ అంటే ప్రజలందరికీ ధైర్యం. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది మన అజెండా. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చింది. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా..పక్క రాష్ట్రానికి పంపారు. ప్రమాదకర మద్యంతో 30వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. గత ప్రభుత్వం మద్యం ద్వారా రూ.వేల కోట్లు లూటీ చేసింది. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కూటమి ఏర్పడింది. ప్రజలు కూటమిని ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటం హోలీ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇక, నా పైన కూడా 23 కేసులు పెట్టారు.. తగ్గేదే లేదు అని ఆనాడే చెప్పాం.. విధ్వంసం పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది.. ఒక్క కంపెనీ తీసుకురాక పోగా ఉన్న కంపెనీలను పక్క రాష్ట్రాలకు వెళ్లేలా చేశారు.. జే బ్రాండ్ లిక్కర్ పేరుతో మద్యం కంటే విషం పంచారని ఆరోపించారు. అయితే, పవన్ కళ్యాణ్ నాకు అన్నతో సమానం.. జెండాలు, అజెండాలు పక్కన పెట్టి పవన్ కళ్యాణ్ మన కోసం పని చేశారని చెప్పుకొచ్చారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో ఫ్రీబస్ ను నా అక్కా చెల్లెమ్మలకు కల్పిస్తున్నాం అన్నారు. అలాగే, 16 వేల మందితో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.. గత ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ కూటమి ప్రభుత్వానికి సహకరించారు.. ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఒక పద్ధతి ప్రకారం కూటమి సర్కార్ పరిష్కరిస్తుంది.. 8 లక్షల కోట్ల పెట్టుబడులు ఒప్పందాలు కుదిరాయి, దీని ద్వారా 6 లక్షల ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.అలాగే, వైసీపీ హయాంలో ఇబ్బంది పడ్డ కుటుంబాలను కలుస్తున్నాను అని మంత్రి లోకేష్ తెలిపారు. వైసీపీ కార్యకర్తల్లారా ఏనాడైనా మీ నాయకుడు కలిశారా?.. 25 ఎంపీ స్థానాల్లో కూటమి 21 స్థానాల్లో గెలిచింది.. దీంతో కేంద్ర ప్రభుత్వం మనతో కలిసి పని చేస్తుంది.. మూడు పార్టీలు కలిసి ఉన్నప్పుడు చిన్న చిన్న సమస్యలు సహజం.. మిస్ ఫైర్లు, క్రాస్ ఫైర్లు, విడాకులు ఉండకూడదు.. ఈగోలు వదిలి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ఇక, తల్లిని చెల్లిని గెంటింది ఎవరు?.. బాబాయినీ చంపింది ఎవరు?.. జే బ్రాండ్ అమ్మి ప్రజల రక్తం పీల్చింది ఎవరు?.. అందరూ రెడ్ బుక్ రెడ్ బుక్ అంటున్నారు.. ఎందుకయ్య అంత భయం.. రెడ్ బుక్ అనగానే ఒకడికి గుండెపోటు-, ఇంకొడికి బాత్ రూంలో కాలు విరిగింది, మరొక్కడు ఎక్కడ ఉన్నాడో తెలియదు.. అర్థ మైందా రాజా.. రాయలసీమ గడ్డా టీడీపీ అడ్డా అని నారా లోకేష్ వ్యాఖ్యానించారు.

# మారు వేషంలో కలెక్టర్ పర్యటన

## గుంతకల్ల ఆస్పత్రి పరిశీలించి ఆరా

**అనంతపురం,మే29(సమయజ్యోతి):**

అనంత జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ మారువేషంలో జిల్లాలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన ఈ పని చేశారు. ప్రజాసేవకు నూతన మార్గంగా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలతో.. అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా, కలెక్టర్ వినోద్ కుమార్ మారువేషంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు చేశారు. అయితే, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సామాన్యుడిలా గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలియతిరుగుతూ.. రోగుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖానికి మాస్క్, మెడలో టవల్ కప్పుకుని ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్నీ పరిశీలించారు. ఆసుపత్రి బయట చెప్పులు విడిచి వెళ్లి.. రోగులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని  కలెక్టర్ వినోద్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# కడపలో కదం తొక్కిన పసుపు సైన్యం

## బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం

**కడప,మే29(సమయజ్యోతి):**

కడపలో నిర్వహించిన మహానాడు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. ఆశించిన మేర కన్నా అధిక సంఖ్యలో తరలిరావడతో కడప పరిసరాలు జనసంద్రంగా మారాయి. కడప పట్టణం పసుపు వర్ణంగా మారింది. తెలుగుదేశం జెండా వాహనాలతో  రహదారులు కిటకిటలాడుతున్నాయి. మహానాడుకు సమీప గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, కాలినడకన చేరుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేశారు. మహానాడు ప్రాంగణంలో 3 లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు- చేశారు. కార్యకర్తల కోసం కడప మార్గమధ్యంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు- చేశారు. దారిపొడవునా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతో దాహార్తి తీరుస్తున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రజలు తరలి రాలేదని అభిమానులు చెబుతున్నారు. ప్రజలు భారీగా రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటి సారిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు 140 ఎకరాల సభా ప్రాంగణం మొత్తం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా పసుపు సైన్యం తరలివచ్చింది.

# రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యం

## విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా పయనం

## ఒక్కో ఇటుక పేరుస్తూ వస్తున్నాం

## సంపద సృష్టించడమే తెలుగుదేశం పార్టీ విధానం

## గొడ్డలిపోటు రాజకీయాలకు టిడిపి దూరం

## కష్టాలు చూసి బెదిరలేదు.. సవాళ్లకు పారిపోలేదు.

## ఉగ్రవాదులనే కాదు..ఆర్థిక ఉగ్రవాదులను తరిమి కొట్టాల్సిందే

## రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోపిడీ

## డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజు

## ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు

## కలసికట్టుగా సాగితే వైకాపా మటుమాయం తప్పదు

## కడప మహానాడు బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగ పూరిత ప్రసంగం

**కడప,మే29(సమయజ్యోతి):**

విధ్వంసానికి గురైన రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఒక్కో ఇటుక పేరుస్తూ పునర్నిర్మాణానికి అంకితమై పనిచేస్తున్నామని తెలుగుదేశం అధినేత, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వైనాట్ గొడ్డలిపోట్లు అనేవి మన విధానం కాదు. ప్రతిక్షణం కష్టపడి పనిచేయడం మన విధానం. కష్టాలు చూసి బెదిరిపోలేదు.. సవాళ్లు చూసి పారిపోలేదు. క్లైమోర్ మైన్లకే భయపడలేదు.. సమస్యలకు భయపడతానా అంటూ వ్యాఖ్యానించారు. ఇటుక, ఇటుక పేర్చుతూ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం నా జీవిత ఆశయం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. నా కష్టం నాకోసం  కాదు.. నన్ను నమ్మిన జనం కోసం పాటుపడుతున్నానని అన్నారు. మూడ్రోజుల కడప మహానాడు ముగింపు సందర్భంగా  గురువారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. దేశానికి ఉగ్రవాదుల వల్ల చాలా నష్టం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదుల వల్ల కూడా అంతే నష్టం. ఆర్థిక ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం. రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోచేశారు. డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజని హెచ్చరిస్తున్నా. ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు అని హెచ్చరించారు. మనం కలిసికట్టుగా ఉంటే.. వైకాపా అడ్రస్సే ఉండదని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడపలో తొలి మహానాడు సూపర్ హిట్ అయిందని చంద్రబాబు అన్నారు. కడప..తెలుగుదేశం పార్టీ అడ్డా అన్నారు. అది నిరూపించేందుకే ఇక్కడ మహానాడు నిర్వహించామన్నారు. అన్ని దారులు కడపవైపే ఉన్నాయి.. పార్టీ శ్రేణులతో కడప దిగ్బంధమైంది. కడప గడపలో మార్పు కనిపిస్తోంది. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. వైకాపాకు రాయలసీమలో 7 సీట్లు వస్తే.. కడప జిల్లాలోనే కూటమి 7 గెలిచింది. 2029 ఎన్నికల్లో ఉమ్మడి కడపలో పదికి పది స్థానాలు గెలవాలి. తెదేపా కార్యకర్తలే నా బలం, బలగం. మొన్నటి విజయం వెనుక కార్యకర్తల పోరాటం, త్యాగం, కష్టం ఉంది. గత పాలనలో హింసా రాజకీయాలు, కేసులు, అణచివేతలు రాజ్యమేలాయి. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిస్తామని తెదేపా, జనసేన, భాజపా కూటమి ఏర్పాటు- చేసి ప్రజలముందుకొచ్చాం. 94 శాతం స్ట్రయిక్  రేట్‌తో అదిరిపోయే విజయం సాధించాం అని వివరించారు. ప్రజలకు అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందిస్తాం. జూన్ 12 నాటికి 500 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. వాట్సప్‌లో హాయ్ అని పెడితే పనులు జరుగుతాయి. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం.  గత పాలనలో భూతానికి పరిశ్రమలు వెనకడుగు వేశాయి. భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేస్తున్నామని హామీ ఇచ్చా. రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది. రాయల సీమను రాష్ట్రానికి మణిహారంగా మారుస్తాం. రాయలసీమ అభివృద్ధికి బ్లూప్రింట్ ఉంది. ఆరు నెలల్లో కడప హజ్‌హౌస్ పూర్తి చేస్తాం. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుంది. జూన్ 12లోగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని చంద్రబాబు  ప్రకటించారు. జన సముద్రంతో కడప నిండిపోయింది అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంచి చేస్తే ప్రజలు అండగా ఉంటారని కడప ప్రజలు నిరూపించారు.. ఉదయం నుంచి అన్ని దారులు కడప వైపే చూస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జరిగిన మొదటి మహానాడు సూపర్ హిట్ అయింది.. కడప గడపలో మార్పు వస్తుందని ఆనాడే చెప్పాను.. అహంకారంతో విర్రవీగే వారికి కడప జిల్లా ప్రజలు బుద్ధి చెప్పారు.. 2029లో పదికి పది సీట్లు సాధించడానికి మీరు సిద్ధమా.. సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు.. రాయలసీమలో వైసీపీకి ఏడు సీట్లు- వస్తే, కూటమికి అధిక సీట్లు- వచ్చాయి.. ఓడిపోయిన పార్టీ ఇప్పటికీ అర్థం చేసుకోలేదు అర్థం చేసుకోదు కూడా.. ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి పుట్టిన పార్టీ టీడీపీ.. ప్రపంచంలోనే ఒక కేస్ స్టడీ వైసీపీ అని చంద్రబాబు మండిపడ్డారు. ఇక, ఎన్నికల్లో గెలుపులు ఓటములు కొత్త కాదు.. కార్యకర్తలే నా బలం బలగం అని సీఎం చంద్రబాబు అన్నారు. జనసేన, బీజేపీతో కలిసి కూటమి ఏర్పాటు- చేసాం.. దాని ప్రభావం అంతా ఇంతా కాదు.. 83 మంది ఎమ్మెల్యేలకు 30 వేల మెజార్టీ వచ్చింది అన్నారు. ముగ్గురికి 90 వేల పైన మెజార్టీ వచ్చింది.. గొడ్డలి పోటుమన రాజకీయం కాదు.. ప్రతి క్షణం కష్టపడి పని చేయడం మన విధానం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతోనే

## బౌలింగ్ ఎంచుకున్నాఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న క్వాలిఫయర్-1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ అన్నాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. పిచ్ చూడటానికి చాలా కఠినంగా కనిపిస్తోంది. పిచ్ పూర్తిగా గడ్డితో కవర్ చేసింది ఉంది. వీలైనంత వరకు ఆరంభ ఓవర్లలోనే ఈ అడ్వాంటేజ్‌ను వాడుకోవడానికి ప్రయత్నిస్తాం. గత మ్యాచ్‌లో ప్రతీ ఒక్కరు 100 శాతం కంటే ఎక్కువ ఎఫర్ట్ పెట్టారు. జితేశ్, సాల్ట్, కోహ్లీ అసాధారణ ప్రదర్శన కనబర్చారు. తుది జట్టులో ఒక మార్పు చేశాం. నువాన్ తుషారా స్థానంలో హాజెల్ వుడ్ తిరిగొచ్చాడు.'అని రజత్ పటీదార్ చెప్పుకొచ్చాడు.మరోవైపు టాస్ గెలిచినా తాము ముందుగా బ్యాటింగ్ చేసేవాళ్లమని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. 'మేం ముందుగా బ్యాటింగే చేయాలనుకున్నాం. ఇక్కడి రికార్డ్స్ ముందుగా బ్యాటింగ్ చేసిన జట్లకే అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి మాకు విజయం దక్కుతుందనే ఆశతో ఉన్నాను. ప్రేక్షకుల నుంచి మద్దతు అవసరం. వారి అరుపులు మాకు శక్తినిస్తాయి. మా ఓపెనర్ల ఫియర్‌లెస్ గేమ్ అద్భుతం. మార్కో జాన్సెన్ స్థానంలో అజ్మతుల్లా ఆడుతున్నాడు.'అని శ్రేయస్ అయ్యర్ తెలిపాడు.తుది జట్టు:పంజాబ్ కింగ్స్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, జోష్ ఇంగ్లిస్(కీపర్), శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), నెహాల్ వధేరా, శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, కైల్ జేమీసన్ఆర్‌సీబీ: విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, రజత్ పాటిదార్(కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ(కీపర్), రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, జోష్ హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ.



# ఏంచేసినా పంజాబ్ ని మాత్రం ఓడించలేరు!

## మాథ్యూ హేడెన్ కీలక వ్యాఖ్యలు


ముఖ్యమైన క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడేందుకు సిద్ధంగా ఉన్న పంజాబ్ కింగ్స్ జట్టు, 11 సంవత్సరాల తర్వాత తొలిసారి ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెడుతోంది. ఈ భారీ పోరుకు ముందు పంజాబ్ కింగ్స్ విజయంపై చాలా మంది విశ్లేషకులు విశ్వాసం వ్యక్తం చేస్తుండగా, ప్రముఖ క్రికెట్ కామెంటేటర్, ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కింగ్స్ జట్టు ప్రస్తుతం అత్యుత్తమ సమన్వయంతో ఆడుతోందని, వారి బ్యాటింగ్, బౌలింగ్ లైనప్స్ రెండూ సమతుల్యంగా ఉండటమే విజయాలకు కారణమని హేడెన్ అభిప్రాయపడ్డాడు. హేడెన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియాకు రాసిన కాలమ్‌లో, పంజాబ్ జట్టు ఇప్పుడు ఉత్సాహంతో కాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో క్వాలిఫయర్ మ్యాచ్‌కు అడుగుపెడుతోందని పేర్కొన్నాడు. ముఖ్యంగా ఢిల్లీపై పొందిన గెలుపు, పంజాబ్ సీజన్‌లోని మిగిలిన జట్లతో పోలిస్తే అత్యుత్తమ ప్రదర్శన చూపించిందని హేడెన్ స్పష్టం చేశాడు. "వారి ఓపెనర్లు చాలా ప్రభావవంతంగా ఆడుతున్నారు, బౌలింగ్ యూనిట్ ఫామ్‌లో ఉంది, జట్టు మొత్తం సమర్థవంతంగా ముందుకెళ్తోంది" అంటూ హేడెన్ ప్రశంసలు కురిపించాడు. పంజాబ్‌ను వెనక్కి నెట్టడం నిజంగా చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డాడు.ఇక శ్రేయస్ అయ్యర్ నాయకత్వాన్ని కూడా హేడెన్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. "శ్రేయస్ జట్టుతో గొప్ప సమన్వయం కలిగి ఉన్నాడు. యువ ఆటగాళ్లను చక్కగా నిర్వహిస్తున్నాడు. అతని నాయకత్వంలో జట్టు మంచి నిర్ణయాలు తీసుకుంటోంది" అని ఆయన అన్నాడు. పంజాబ్ జట్టులోని ఆటగాళ్లు వ్యక్తిగతంగా కూడా అత్యుత్తమ స్థాయిలో ఉన్నారని హేడెన్ అభిప్రాయపడ్డాడు.ఈ నేపథ్యంలో, %ఖూా% 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కి ఆర్‌సిబి మధ్య జరిగే మొదటి క్వాలిఫయర్ మ్యాచ్ ఈ రోజు (మే 29, గురువారం నాడు) సాయంత్రం 7:30 గంటలకు ముల్లన్‌పూర్‌లో ప్రారంభం కానుంది. ఈ పోరులో విజేత నేరుగా ఫైనల్‌కు అర్హత పొందనుండగా, ఓడిపోయిన జట్టు క్వాలిఫయర్ 2 కోసం మరొక మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. మాథ్యూ హేడెన్ అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం ఉన్న ఫామ్, సమతుల్య సమన్వయం, శక్తివంతమైన లైనప్ ఇవన్నీ పంజాబ్ ను గెలుపు దిశగా నడిపించగలవు. %=జదీ% జట్టుకు ఇది ఒక కఠిన పరీక్షగా మారనుందని స్పష్టంగా కనిపిస్తోంది.

# ధోనీ సరైన మూడ్‌లో లేకపోతే మాట్లాడడానికి ఆలోచిస్తా

## ఆల్?రౌండర్ రవీంద్ర జడేజా ఆసక్తికర వ్యాఖ్యలు



చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ ఐపీఎల్?లో ప్లేఆఫ్స్?కు చేరడంలో విఫలమైంది. పేలవ ప్రదర్శనతో ఆ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. లీగ్ మధ్యలో లెజెండరీ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ జట్టు పగ్గాలు చేపట్టినా, చెన్నై ఆటతీరు మారలేదు. ఈ క్రమంలో ధోనీ నాయకత్వంపై ఆ జట్టు స్టార్ ఆల్?రౌండర్ రవీంద్ర జడేజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రీసెంట్?గా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానెల్? పాడ్?కాస్ట్?లో మాట్లాడిన జడ్డూ, ధోనీని తొలిసారి కలిసిన సందర్భం, అతడి కెప్టెన్సీ గురించి కొన్ని విషయాలు షేర్ చేసుకున్నాడు.'ధోనీని నేను 2005లో తొలిసారి చెన్నైలో కలిశాను. అప్పుడు ఛాలెంజర్స్ ట్రోఫీ జరుగుతుంది. అప్పుడు నేను ఫ్లైట్?లో ముంబయి నుంచి వస్తున్నాను. అదే విమానంలో ధోనీ కూడా ఉన్నాడు. అయితే నాది ఎకానమీ క్లాస్, తనది బిజినెస్ క్లాస్. అయితే ధోనీ ఈ విమానంలో ఉన్నాడంటూ అక్కడ అందరూ మాట్లాడుకున్నారు. కానీ నేను అతడిని కలవడానికి సంకోచించాను. ఇప్పటికీ ధోనీ సరైన మూడ్?లో లేకపోతే నేను తనతో మాట్లాడడానికి ఆలోచిస్తాను. అతడు ఏమీ అనడు. కానీ, తాను మాట్లాడే మూడ్?లో లేడని ధోనీ ముఖం చూస్తే తెలిసిపోతుంది'అని జడేజా చెప్పుకొచ్చాడు.అలాగే ధోనీని తొలిసారి కలిసినప్పుడు ఏం జరిగిందో కూడా జడేజా వివరంగా చెప్పాడు. అప్పుడు ధోనీ ఫోన్ పోయిందట. అలా జరగడం వల్ల ధోనీ నుంచి తాను తప్పించుకున్నానని అన్నాడు. 'విమానంలో ధోనీని చూసినప్పుడు, నేను చిన్నవాడిని. అప్పుడు అతడు పొడవైన జుట్టుతో ఉన్నాడు. ఇక ఎయిర్?పోర్ట్?లో దిగాక, మేమంతా ధోనీతో కలిసి హోటల్‌కు వెళ్లాలని మా మేనేజర్ చెప్పాడు. అంతే నాకు కాస్త బెరుకుగా అనిపించింది. నేను ధోనీతో ఎలా వెళ్లాలి అనుకున్నా. ఎంతైనా అతడు ధోనీ అని చాలా ఆలోచించా'కానీ, అదృష్టవశాత్తూ అప్పుడే ధోనీ తన ఫోన్‌ను పారేసుకున్నాడు. దాని కోసం అతడు అక్కడే వెయిట్ చేస్తున్నాడు. అతడిని తప్పించుకొని అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ఇదే కరెక్ట్ టైమ్ అని అనుకున్నా. మరి ఆ సమయంలో నేను ధోనీతో ఏం మాట్లాడాలి? అని ఆలోచించేవాణ్ని' అని జడేజా తొలిసారి ధోనీని కలిసిన సందర్భంగా గురించి చెప్పాడు.నీ తన పర్సనల్ రికార్డ్స్ గురించి మాట్లాడడం నేనెప్పుడూ వినలేదు. అతడు పర్సనల్ రికార్డ్స్ కోసం కాదు, జట్టు కోసమే ఆడుతాడు. 'ధోనీ పర్సనర్ రికార్డ్స్ గురించి మాట్లాడడం నేనెప్పుడూ వినలేదు. తను సెంచరీ, హాఫ్ సెంచరీల గురించి అస్సలు ఆలోచించడు. ఎల్లప్పుడూ జట్టులోని 10 మంది గురించే ఆలోచిస్తాడు' అని జడ్డూ పేర్కొన్నాడు .కాగా, ధోనీ-జడేజా అటు టీమ్‌ఇండియా, ఇటు ఐపీఎల్?లో చాలా ఏళ్లపాటు కలిసి ఆడారు. ధోనీ కెప్టెన్సీలో జడేజా టీమ్ ఇండియాతో పాటు, చెన్నై జట్టు డ్రెస్సింగ్ రూమ్ షేర్ చేసు కున్నాడు. ధోనీ కెప్టెన్సీలో చెన్నై ఐదుసార్లు ఛాంపియన్?గా నిలిచింది. కానీ, ఈసారి పేలవ ప్రదర్శన వల్ల లీగ్ దశలోనే నిష్క్రమించింది.





# శ్రేయస్ కు తీవ్ర అన్యాయం

## మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్

ఇంగ్లాండ్ పర్యటన కోసం ఎంపిక చేసిన భారత జట్టుపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది ప్లేయర్లను ఎంపిక చేయకపోవడం, సర్ప్రైజింగ్ గా మరికొంతమందిని ఎంపిక చేయడం విచిత్రంగా ఉంది. అసలు ఆటగాళ్లను ఇంత ముఖ్యమైన పర్యటనకు ఏ బేస్ పై ఎంపిక చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా అటు దేశవాళీల్లోనూ, ఇటు వన్డేల్లో, ఐపీఎల్లో చక్కగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్ ను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అసంతృప్తి వ్యకత్ం చేశాడు. అన్ని ఫార్మాట్లలో శ్రేయస్ బాగా ఆడుతున్నాడని, అలాంటి ఆటగాడిని పక్కన పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నాడు. ఇక ఏ గణాంకాలు తీసుకుని శ్రేయస్ ను పక్కన పెట్టారని అడుగుతున్నాడు. అదే సమయంలో జట్టులోకి నూతనంగా ఎంపికైన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ పై చర్చను లెవనెత్తాడు. నిజానికి సుదర్శన్ చాలా మంచి ఆటగాడని, ఐపీఎల్లో సత్తా చాటి ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడని కైఫ్ గుర్తు చేశాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శననే ఇంగ్లాండ్ టూరుకు గీటురాయిగా తీసుకోవద్దని, అతని రెడ్ బాల్ ఫార్మాట్ ప్రదర్శనను కూడా చూడాలని హితవు పలికాడు. ఒకవేళ ఐపీఎల్ ప్రదర్శనే గీటురాయి అనుకుంటే శ్రేయస్ కూడా బాగా రాణించాడని, అటు పంజాబ్ కెప్టెన్ గా వ్యవహరించి, 11 ఏళ్ల తర్వాత ప్లే ఆఫ్స్ కు తీసుకొచ్చిన విషయాన్ని స్పష్టం చేశాడు. అసలు సెలెక్టర్లు ఏ బేసిస్ పై ఆటగాళ్లను ఎంపిక చేస్తున్నారని ప్రశ్నించాడు. బీసీసీఐ, సెలెక్టర్లు ద్వంద్వ వైఖరితో నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టాడు.ఇక 11 ఏళ్ల తర్వాత ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు క్వాలిఫై అవడంపై పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయస్ అనందం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తనకు కావాల్సినంత ఫ్రీడమ్ ఇవ్వడంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నాడు. నిర్ణయాలను సొంతంగా తీసుకునే స్వేచ్ఛను ఇచ్చాడని, దీంతో తను చాలా ఫ్రీగా పని చేశానని పేర్కొన్నాడు. మరోవైపు ఈ సీజన్ లో అదరగొట్టిన పంజాబ్.. 9 విజయాలతో ఓవరాల్ గా 19 పాయింట్లతో లీగ్ టేబుల్లో టాప్ లో నిలిచింది. దీంతో క్వాలిఫయర్ 1కు అర్హత సాధించింది. గురువారం జరిగే క్వాలిఫయర్ 1లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరగా.. మరో జట్టు క్వాలిఫయర్ 2 ఆడుతుంది. ఇక ఎలిమినేటర్ మ్యాచ్ లో భాగంగా ఈనెల 30న ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ లో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుండగా, గెలిచిన జట్టు క్వాలిఫయర్ 2 ఆడుతుంది. ఇక ప్లే ఆఫ్స్ కు చేరిన నాలుగు జట్లలో ముంబై ఇండియన్స్ ఐదుసార్ల చాంపియన్ గా నిలవగా, గుజరాత్ టైటాన్స్ ఒక్కసారి టైటిల్ కొట్టింది. మూడుసార్లు ఆర్సీబీ, ఒక్కసారి పంజాబ్ కింగ్స్ రన్నరప్ తోనే సరిపెట్టు కున్నాయి.

## చరిత్రకు అడుగు దూరంలో

# విరాట్ కోహ్లీ



ఐపీఎల్ 2025లో విరాట్ కోహ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చాలా బాగా రాణిస్తోంది. విరాట్ కోహ్లీ జట్టుకు కెప్టెన్ కాకపోయినా జట్టు బాధ్యత ఇప్పటికీ ఆయన భుజాలపైనే ఉంది. విరాట్ కోహ్లీ కూడా ఈ బాధ్యతను చాలా బాగా నిర్వర్తిస్తున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీ మంచి దూకుడుతో బ్యాటింగ్ చేస్తున్నాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చూస్తుంటే చాలా త్వరగా టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయినట్లు అనిపిస్తుంది. ఇంతలో విరాట్ గొప్ప రికార్డుకు చాలా దగ్గరగా వచ్చాడు. కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్, పాకిస్తాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. టీమిండియా, ఆర్సీబీ రన్ మెషీన్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడు. విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో 412 మ్యాచ్‌లు ఆడాడు. ఈ కాలంలో విరాట్ కోహ్లీ 42.01 సగటు, 134.75 స్ట్రైక్ రేట్‌తో 13488 పరుగులు చేశాడు. అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ 5వ స్థానంలో ఉన్నాడు. అదే సమయంలో వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్ 13537 పరుగులతో నాల్గవ స్థానంలో, పాకిస్థాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ 13571 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఇంకా ఐపీఎల్‌లో మూడు మ్యాచ్‌లు ఆడగలడు. ఈ జాబితాలో ఈ ఇద్దరు బ్యాటర్లను విరాట్ కోహ్లీ సులభంగా అధిగమించగలడు.కీరన్ పొలార్డ్‌ను అధిగమించడానికి విరాట్ కోహ్లీకి 50 పరుగులు, షోయబ్ మాలిక్‌ను అధిగమించడానికి 84 పరుగులు అవసరం. విరాట్ కోహ్లీ ప్రస్తుత ఫామ్‌ను చూస్తే ఈ లక్ష్యం విరాట్ కోహ్లీకి చాలా సులభం అనిపిస్తుంది. విరాట్ కోహ్లీ మే 29న పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగే ఐపీఎల్ మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆడతాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మంచి ఇన్నింగ్స్ ఆడితే వారిద్దరినీ అధిగమించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఏ భారతీయుడు ఈ స్థానాన్ని సాధించలేకపోయాడు. విరాట్ కోహ్లీ అలా చేసిన మొదటి భారతీయుడు అవుతాడు. పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ మరో 30 పరుగులు చేస్తే ఆ జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ 1104 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఈ రికార్డు ఆస్ట్రేలియా దిగ్గజం డేవిడ్ వార్నర్ పేరిట ఉంది. డేవిడ్ వార్నర్ పంజాబ్ కింగ్స్ జట్టుపై 1134 పరుగులు చేశాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన డేవిడ్ వార్నర్ రికార్డును సమం చేసేందుకు విరాట్ కోహ్లీ అడుగుదూరంలో నిలిచాడు. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అర్ధ శతకం సాధిస్తే డేవిడ్ వార్నర్ సరసన చేరుతాడు. విరాట్ కోహ్లీ ఈ ఐపీఎల్ సీజన్లో ఇప్పటివరకు 8 హాఫ్ సెంచరీలు చేశాడు. 2016 ఐపీఎల్ సీజన్లో డేవిడ్ వార్నర్ 9 ఫిఫ్టీలు సాధించాడు.విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2025లో 13 ఇన్నింగ్స్‌లలో 60.20 సగటు, 147.91 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 602 పరుగులు చేశాడు. ఈ సారి ఆర్సీబీ విజయంలో విరాట్ కోహ్లీ చాలా కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ ఫైనల్ వరకు ఈ ఫామ్‌ను కొనసాగించాలను కుంటున్నాడు. ఐపీఎల్ 2025లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ గెలుచుకునే రేసులో కూడా ఉన్నాడు.

# హరిహర వీరమల్లు కోసం పవన్ తపన

## ఏకబిగిన నాలుగు గంటలు డబ్బింగ్

అగ్ర కథానాయకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సినిమాల వేగాన్ని పెంచారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తి కాగా, ఇందుకు సంబంధించిన డబ్బింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఇందుకోసం నాలుగు గంటలు ఏకబిగిన డబ్బింగ్ చెప్పేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం అప్‌డేట్‌ను పంచుకుంది. హరి హర వీరమల్లు' డబ్బింగ్‌ను అన్‌స్టాపబుల్ ఫోకస్, ఫైర్‌తో పవన్‌కల్యాణ్ పూర్తి చేశారు. ఆయనకున్న బిజీ షెడ్యూల్ కారణంగా రాత్రి 10 గంటలకు డబ్బింగ్ మొదలవగా ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారు. పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి. జూన్ 12న మీ ఉత్తేజం ఉరకలేస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీలో పవన్‌కల్యాణ్ పోరాట యోధుడిగా కనిపించనున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. కొన్నేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం ఎట్టకేలకు పూర్తయింది. క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది.




# మహేశ్ ఖలేజా నేడు రీ రిలీజ్

## నష్టాలను పూడ్చుకుంటామన్న నిర్మాత కళ్యాణ్

మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఖలేజా ఒకటి. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీ రిలీజ్ కానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా దీనిని రీ రిలీజ్ చేస్తున్నారు. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెఫరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీ రిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది. ఖలేజా రీ రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు. బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీ రిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# గద్దర్ అవార్డులతో

## చిత్ర సంస్థల అభినందనలు-అవార్డులు దక్కినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

తెలంగాణ ప్రభుత్వానికి టాలీవుడ్ నిర్మాణసంస్థలు కృతజ్ఞతలు తెలిపాయి. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం గద్దర్ అవార్డును ప్రకటించింది. ఇందులో పలు సినిమాలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా నిర్మాణసంస్థలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్‌లు పెట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి దర్శక, నిర్మాతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ అవార్డుల్లో లక్కీ భాస్కర్ సినిమా హవా చూపింది. ఏకంగా నాలుగు అవార్డులను (ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటర్) సొంతం చేసుకుంది. ఇది టీమ్‌కు ఎంతో గర్వకారణమని నిర్మాణసంస్థ పేర్కొంది. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పింది. అలాగే తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' అవార్డును సొంతం చేసుకుంది. దీనిపై నిర్మాణసంస్థ వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. చిత్ర బృందాన్ని ప్రోత్సహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఉత్తమ పరిచయ దర్శకుడిగా 'కమిటీ- కుర్రాళ్లు'కు గాను యధువంశీ అవార్డును సొంతం చేసుకున్నారు. వంశీకి అవార్డు ఇచ్చినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెబుతూ నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్ పోస్ట్ పెట్టింది. 'కమిటీ- కుర్రాళ్లు టీమ్‌కు ఇదో ఒక మైలురాయి. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మా కృతజ్ఞతలు. మా శ్రమను గుర్తించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు. ఈ గుర్తింపు మా గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొంది. ఇక 'ఆయ్' సినిమా ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా నిలిచింది. దీంతో చిత్రబృందం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొంది.

# గద్దర్ అవార్డుల ప్రకటన

హైదరాబాద్,మే29(సమయజ్యోతి): గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యరు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ-.. విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్ పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిసారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో సినీ అవార్డుల జూరి ఏర్పాటు- అయ్యింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను అవార్డుల కమిటీ- చైర్మన్ జయసుధ ప్రకటించారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. అలాగే 2014-23 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు.

గద్దర్ అవార్డులు దక్కిన వివరాలు ఇలా ఉన్నాయి.
ఉత్తమ చిత్రం - కల్కి
ఉత్తమ రెండో చిత్రం - పొట్టేల్
ఉత్తమ మూడో చిత్రం - లక్కీభాస్కర్
ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప-2)
ఉత్తమ నటి - నివేదా థామస్ (35 చిన్న కథకాదు)
ఉత్తమ డైరెక్టర్ - నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు - ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి - శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్)
ఉత్తమ హాస్యనటుడు - సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
ఉత్తమ సంగీత దర్శకుడు - బీమ్స్ (రజాకార్)
ఉత్తమ స్టోరీ రైటర్ - శివ పాలడుగు
ఉత్తమ స్క్రీన్ ప్లే - వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గాయకుడు - సిద్ద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకో)
ఉత్తమ గాయని - శ్రేయా ఘోషల్ (పుష్ప-2)
ఉత్తమ కొరియోగ్రాఫర్ - గణేష్ ఆచార్య (దేవ)
స్పెషల్ జ్యూరీ అవార్డు - దుల్కర్ సల్మాన్ (లక్కీభాస్కర్)
స్పెషల్ జ్యూరీ అవార్డు - అనన్య నాగళ్ల (పొట్టేల్)
బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్ - యధువంశీ (కమిటీ- కుర్రాళ్లు)
2024 ఉత్తమ బాలల చిత్రం - 35 చిన్న కథకాదు
బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ - హెరిటేజ్-హిస్టరీ విభాగం - రజాకార్
నేషనల్ ఇంటెగ్రిటీ- సోషల్ అప్‌లిఫ్ట్ విభాగం - కమిటీ- కుర్రాళ్లు

**ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ-ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ ఉత్తమ నటిగా నివేదా థామస్- ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్ అవార్డుల వివరాలు ప్రకటించి జయసుధ, దిల్‌రాజ్**







EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685